ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 11 సెప్టెంబరు 2025
గరిష్ఠం 31.5
కనిష్ఠం 23.4

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.10 (309.3558)	70,769	70,769
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,424.06	1,711.69
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.423 (43.3532)	45,230	45,985

చికెన్ ధరలు | లైవ్ : రూ.144 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పాడిరైతుల సంక్షేమమే ధ్యేయం

- విజయ డెయిరీని బలోపేతం చేస్తాం
- ఫెడరేషన్ విస్తరణకు ప్రణాళిక
- త్వరలో కొత్త సొసైటీలు
- ఏడాదిలో నష్టాల దశ నుంచి లాభాల్లోకి తీసుకువచ్చాం
- డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి

పాడి రైతుల సంక్షేమం, విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం, జిల్లాల్లో కుంటుపడిన డెయిరీలను పునరుద్ధరించి లాభాల్లోకి తేవడమే మా ముందున్న కర్తవ్యం.. ప్రభుత్వ మద్దతు, పాడిరైతుల సహకారం, అధికారులు, ఉద్యోగుల అంకితభావంతో విజయ డెయిరీని ప్రగతిపథంలోకి తీసుకువస్తాం.. అని తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఫెడరేషన్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మాట్లాడుతూ విజయ డెయిరీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

● నేను బాధ్యతలు తీసుకునే నాటికి ఫెడరేషన్ గడ్డుపరిస్థితుల్లో ఉంది. రూ.200కోట్ల అప్పులు పేరుకుపోగా, మూడునెలల పాలబిల్లులు సైతం రైతులకు ఇవ్వలేని పరిస్థితి ఉంది. ప్రతి రోజూ 4లక్షల లీటర్ల పాలు సేకరిస్తే, అందులో 1.50లక్షల లీటర్ల పాలు మిగిలిపోయేవి. దీంతో వీటిని ప్రాసెసింగ్ చేయడం కోసం ప్రతి రోజూ చిత్తూరు పంపేవాళ్లు. అక్కడ పౌడర్‌గా, వెన్నగా మార్చి మళ్లీ ఇక్కడికి తెచ్చి విక్రయించేవారు. దీంతో లీటర్‌కు రూ.8చొప్పున అదనపు ఖర్చు వచ్చేది. ప్రతి రోజూ కనీసం రూ.12లక్షల అదనపు వ్యయం అయ్యేది. అంతేగాక ఏడాదిలో 1600 మెట్రిక్‌టన్నుల పౌడర్, 1400 క్వింటాళ్ల నెయ్యి వృథాగా పోయింది. ఈ విధంగా నెలకు రూ.15కోట్ల వరకు నష్టాలు వచ్చేవి. నేను బాధ్యతలు తీసుకునే ముందు మూడేళ్లపాటు ఇదే పరిస్థితి కొనసాగింది. అందుకే రూ.200కోట్ల పైచిలుకు నికరనష్టం వచ్చింది. చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నాక పరిస్థితిని సమీక్షించి ముఖ్యమంత్రికి, మంత్రులకు వివరించగా, వారు డెయిరీ పునరుద్ధరణకు మద్దతుగా నిలిచారు. రూ.100కోట్ల గ్రాంట్ ఇవ్వగా, ఆ నిధులతో డెయిరీలో సంస్కరణలు చేపట్టి మరో రూ.50 కోట్లు జమచేసి రైతుల బకాయిలు చెల్లించాం.


సంస్కరణలతో నష్టాల పూడ్చివేత

విజయ డెయిరీని లాభాల్లోకి తీసుకు వచ్చేందుకు సంస్కరణలు అమలు చేస్తున్నాం. ఖర్చులు తగ్గించాం. పాలసేకరణకు అయ్యే ఖర్చులు, విద్యుత్, రవాణా తదితర ఖర్చులను తగ్గించాం. పాలసేకరణే కాకుండా పాల విక్రయాలను పెంచాం. దీంతో ప్రాసెసింగ్ ఖర్చులు తగ్గించాం. 4లక్షల లీటర్ల పాలు సేకరిస్తే, అందులో 2.50లక్షల పాలను నేరుగా విక్రయిస్తున్నాం. మిగిలిన పాలను చిత్తూరుకు పంపకుండా ఇక్కడే సీఎం, మంత్రుల సూచనలతో రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థలకు, హాస్టళ్లకు విజయ డెయిరీ పాలనే సరఫరా చేస్తున్నాం. అదేవిధంగా అంగన్‌వాడీలకు మరో 50వేల లీటర్లను టెట్రాప్యాకెట్ల ద్వారా అందజేస్తున్నాం. రాష్ట్రంలోని దేవాలయాలన్నింటికీ విజయ డెయిరీ నెయ్యినే అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా ప్రతి రోజూ 50 మెట్రిక్‌టన్నుల నెయ్యి సరఫరా చేస్తున్నాం. దీంతో భారీగా ఖర్చు తగ్గడమేగాక లాభాల దశకు చేరాం.

డెయిరీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ

రాష్ట్రంలో 1500 వరకు నేరుగా ఫెడరేషన్ కింద పనిచేసే సొసైటీలు ఉన్నాయి. వీటిని విస్తరించాలని నిర్ణయించాం. ప్రస్తుతం సొసైటీలు లేని చోట్ల, పాలసేకరణ అవకాశాలు ఉన్నచోట్ల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నాం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ, మిగతా 6వ పేజీలో...

అమ్మో పెద్ద ప్లానింగే!



- అవినీతికి అడ్డాగా టౌన్‌ప్లానింగ్ విభాగం
- మామూళ్లు అందనిదే కదలని ఫైళ్లు
- కిందిస్థాయి సిబ్బందితో వసూళ్లు
- అధికారుల కొరత, ఉన్న వారి నిర్లక్ష్యంతో అక్రమ కట్టడాలు

ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లో టౌన్‌ప్లానింగ్ అధికారులు అంతస్తుకో రేటు నిర్ణయించి, చేయి తడిపితే చాలు నో అబ్జక్షన్ అనేస్తున్నారు. దీంతో సెట్ బ్యాక్ అనేది లేకుండా నిర్మాణాలు వెలుస్తున్నాయి. విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు సాగుతున్నా పట్టించుకునే వారు లేరు. దీనికి తోడు సర్వేయర్లతో పాటు క్షేత్రస్థాయి సిబ్బందితో మామూళ్లు వసూలు చేయిస్తున్నారు. ఏసీబీకి చిక్కకుండా జాగ్రత్తలు పడేందుకు వారితో మామూళ్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. 6



పరిషత్ ఓటర్లు 10.73లక్షలు

- 1,956 పోలింగ్ కేంద్రాలు ఖరారు
- తుదిజాబితా ప్రచురణ
- ఇక రిజర్వేషన్లే తరువాయి

నల్లగొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పరిషత్ ఎన్నికల ఓటర్ల తుదిజాబితా ఖరారైంది. బుధవారం సాయంత్రం వరకు ఎలాంటి అభ్యంతరాలు, సవరణలు రాకపోవడంతో ముసాయిదా జాబితాలో పేర్కొన్న ప్రకారమే జిల్లాలో 33 జడ్పీటీసీ స్థానాలు, 33 ఎంపీపీ స్థానాలతో పాటు, 353 ఎంపీటీసీ స్థానాల పరిధిలో 1,956 పోలింగ్ కేంద్రాలను ఖరారు చేశారు. మొత్తం 10,73,506 మంది ఓటర్లను నిర్ధారించారు. ఈ మేరకు తుదిజాబితాను జిల్లా సహాయ ఎన్నికల అధికారి, జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు బుధవారం అధికారికంగా ప్రకటించారు.

జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

జిల్లాలో తుది జాబితా ప్రకారం 33 జడ్పీటీసీ స్థానాలు, 353 ఎంపీటీసీ స్థానాల్లో మొత్తం 10,73,506 మంది ఓటర్లు ఉండగా, అందులో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 5,42,589 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 5,30,860 మంది పురుష ఓటర్లు, 57మంది థర్డ్‌జండర్ ఓటర్లు ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా 55,180 ఓటర్లతో మిర్యాలగూడ మండలం తొలి స్థానంలో నిలవగా, 12,271 ఓట్లతో గుడిపల్లి తక్కువ ఓట్లున్న మండలంగా నిలిచింది.

26 మండలాల్లో మహిళా ఓటర్లే అధికం

జిల్లాలోని 33 మండలాలకు 26 మండలాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. అనుముల, చండూరు, చింతపల్లి, చిట్యాల, దామరచర్ల, గుడిపల్లి, డిండి, గుర్రంపోడు, కనగల్, కట్టంగూరు, కేతేపల్లి, మాడుగులపల్లి, మర్రిగూడ, మిర్యాలగూడ, మునుగోడు, నకిరేకల్, నల్లగొండ, నాంపల్లి, నార్కట్‌పల్లి, నిడమనూరు, పెద్దవూర, తిప్పర్తి, శాలిగౌరారం, తిరుమలగిరిసాగర్, త్రిపురారం, వేములపల్లి మండలాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. దీంతో ఈ జడ్పీటీసీ స్థానాలను మహిళలకు కేటాయిస్తారనే చర్చ సాగుతోంది.

రిజర్వేషన్లు రాగానే ఎన్నికలకు సన్నద్ధం

పంచాయతీ రాజ్ ఎన్నికల్లో ఇటు గ్రామ పంచాయతీలకు వార్డుల వారీగా, అటు పరిషత్‌లకు ఎంపీటీసీ, పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాల తుది ప్రచురణ పూర్తయింది. దీంతో ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ప్రాథమిక దశ ముగిసింది. ఇక ప్రభుత్వం రిజర్వేషన్ల కోటా జీవో ఇస్తే రిజర్వేషన్ల ఖరారు, కేటాయింపుల మిగతా 8వ పేజీలో...



ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను గడువులోగా పూర్తిచేయాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాన్ని నిర్ణీత తొమ్మిది నెలల గడువులోగా పూర్తిచేయాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను ఆయన తనిఖీచేసి పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 25 ఎకరాల్లో అధునాతన హంగులతో, ప్రపంచస్థాయి ప్రమాణాలతో స్కూల్‌ను నిర్మిస్తున్నామని అన్నారు. అందులో 1.10లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్స్ నాలుగు బ్లాకులుగా నిర్మిస్తున్నామన్నారు. దీంతో పాటు స్టాఫ్ క్వార్టర్స్, డైనింగ్ హాల్, ఇతర నిర్మాణ పనులు సమాంతరంగా జరిగేలా వేగంగా నిర్వహించాలన్నారు. ఒకటో బ్లాక్ మొదటి స్లాబ్ అక్టోబరులోగా పూర్తవ్వాలన్నారు. రాష్ట్రంలో నల్లగొండ స్కూల్ నిర్మాణం ఆదర్శంగా ఉండాలని, అందుకు అనుగుణంగా అధికారులు, వర్క్ ఏజెన్సీ పని చేయాలన్నారు. కార్యక్రమంలో మంత్రి వెంట పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి

చదవడం, రాయడం నేర్పించాలి

విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ధారాళంగా మాట్లాడటంతోపాటు చదవగలిగే నైపుణ్యాలను నేర్పించాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీచేశారు. పాఠశాలలో జరుగుతున్న ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల తీరును పరిశీలించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రాముఖ్యాన్ని ఉపాధ్యాయులకు వివరించారు. పదో తరగతిలో గత ఏడాదికంటే మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. డీఈవో భిక్షపతి మాట్లాడుతూ, మండలంలో పాఠశాల విద్యార్థి పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. వారి వెంట ఎంఈవో వెంకటేశం, హెచ్‌ఎం హిమజ, కాంప్లెక్స్ హెచ్‌ఎం డి.రాములు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కేతేపల్లి, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ సూచించారు. బుధవారం కేతేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఆస్పత్రి ఏఎన్‌సీ, హైరిస్క్ కేసుల రిజిస్టర్లు, బాలింతలు, చిన్నారులకు వేసే వ్యాక్సిన్ నిల్వలు, కుక్క, పాము కాటు వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు. ల్యాబ్‌లో వివిధ పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్యాధికారులు క్షేత్రస్థాయి వైద్య సిబ్బందికి తగిన సూచనలు చేస్తూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు అర్చన కొండ్ర, ఎం.దివ్య, సిబ్బంది రవీందర్, యాదయ్య, నిర్మల, తదితరులు ఉన్నారు.

గవర్నర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఎంజీయూలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా తిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎంజీ యూనివర్సిటీకి ఈనెల 15న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రానున్నందున అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయాన్ని ఆమె సందర్శించి స్నాతకోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గవర్నర్ రాక సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి బాధ్యతల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. 15న ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. మెడికల్, 108, 104, ప్రత్యేక వైద్యుల బృందాన్ని అందుబాటులో ఉంచాలని, వేదిక ఏర్పాట్లను పూర్తిచేయాలన్నారు. తాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, యూనివర్సిటీలో పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాటుచేస్తామని, తనిఖీలు ఉంటాయని, గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతిస్తామన్నారు. గేటు వద్ద తనిఖీ కోసం యూనివర్సిటీ తరఫున నలుగురు బృందం సభ్యులు ఏర్పాటు చేయాలని వీసీని కోరారు. గవర్నర్ కార్యక్రమానికి హాజరయ్యే అందరి పేర్ల జాబితాను ముందే సమర్పించాలని కోరారు. అంతకు ముందు వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ, యూనివర్సిటీ స్నాతకోత్సవంలో భాగంగా 15న ఉదయమే గవర్నర్ ప్రత్యేక సమావేశం ఉంటుందని, ఉదయం 11గంటలకు ఆయన వస్తారని తెలిపారు. 22 మంది పీహెచ్‌డీ విద్యార్థులు, 57 మంది బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు వాటిని ప్రదానం చేసిన అనంతరం గవర్నర్ ప్రసంగం ఉంటుందని తెలిపారు. 1గంటకు గవర్నర్ తిరిగి వెళ్తారని, ఏర్పాట్ల కోసం యూనివర్సిటీలో 12 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్‌ఎస్ మాతృనాయక్, డీఈ నదీంఅహ్మద్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, పాల్గొన్నారు.

13న కుక్కలను దత్తత తీసుకునే కార్యక్రమం

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): వీధి, పెంపుడు కుక్కలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 13న జిల్లా కేంద్రంలోని రామగిరి మునిసిపల్ పార్కులో కుక్కల దత్తత, వాక్సినేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అదనపు కలెక్టర్లు నారాయణ్ అమిత్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రమేష్ బుధవారం జిల్లా కేంద్రంలోని రామగిరి మునిసిపల్ పార్కులో ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో కుక్కల దత్తత, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. దేవరకొండ మునిసిపాలిటీలో కార్యక్రమం విజయవంతం కావడంతో నల్లగొండ మునిసిపాలిటీలో జంతు ప్రేమికులు కుక్కలను దత్తత తీసుకునేలా ప్రోత్సహించేందుకు 13న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఇప్పటికే 30మంది కుక్కలను దత్తత తీసుకునేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

(ఆంధ్రజ్యోతి, చిట్యాలరూరల్): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో హెటిరో ఫార్మా కంపెనీ అనుబంధ సంస్థ దశమి ల్యాబ్స్ ఫార్మా కంపెనీలో నిర్వహించిన వనమహోత్సవంలో కలెక్టర్ మొక్క నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో యారాల అశోక్‌రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఇన్‌స్పెక్టర్ జానయ్య, జిల్లా పరిశ్రమల మేనేజర్ సతీష్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకన్న, తహసీల్దార్ జి.కృష్ణ, ఎంపీడీవో ఎస్‌పి.జయలక్ష్మి, దశమి ప్రతినిధులు, ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనివేళల్లో కార్యాలయానికి తాళం వేస్తారా?

- ఎల్లారెడ్డిగూడెం జీపీ కార్యదర్శిపై డీపీవో ఆగ్రహం
- కారోబార్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు



పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో వెంకయ్య

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పనివేళల్లో గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేస్తారా? డ్యూటీ అంటే ఇంత నిర్లక్ష్యమా? అంటూ పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిపై జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వస్తానని చెప్పినా, కార్యాలయంలో ఏ ఒక్క సిబ్బంది ఉండకపోగా తాళాలు వేసి వెళ్లిపోతారా? అంటూ అసహనం ప్రదర్శించారు. విధుల్లో అలసత్వం వహించారనే కారణంతో కారోబార్‌ను సస్పెండ్ చేస్తూ అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య బుధవారం మధ్యాహ్నం వచ్చారు. అప్పటికే కార్యాలయానికి తాళాలు వేసి సిబ్బంది వెళ్లారు. దీంతో డీపీవో తన సిబ్బంది ద్వారా పంచాయతీ కార్యదర్శి చిరుమర్తి వెంకన్నకు ఫోన్ చేయించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎంపీడీవో సమావేశం ఏర్పాటు చేస్తే నార్కట్‌పల్లి వెళ్లానని చెప్పిన కార్యదర్శి కొద్దిసేపటికే అక్కడికి చేరుకున్నారు. కారోబార్ శేఖర్ వద్ద కార్యాలయ తాళాలు ఉండగా అతడిని పిలిచి కార్యాలయం తెరిపించి మందలించారు. అనంతరం రికార్డులు, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి కారోబార్‌ను సస్పెండ్ చేస్తూ నోట్ చేశారు. అనంతరం టెండర్ ద్వారా పంచాయతీకి చేరిన బ్లీచింగ్ పౌడర్ నిల్వ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయంలో కొందరు ఎంపీడబ్ల్యూఎస్ సిబ్బంది రాజకీయాలు చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని డీపీవో వెంకయ్య ఆదేశించారు.

ఐలమ్మ ఉద్యమం భావితరాలకు స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సత్యం

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ ఉద్యమం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రజక భవనం వద్ద రజక సంక్షేమ భవన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతిలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఐలమ్మ ముందుభాగాన నిలిచి పోరాడిందన్నారు. ఆమె పోరాటం తెలంగాణ రాష్ట్ర సాధన తొలిదశ, మలిదశ ఉద్యమాలకు ఊపునిచ్చిందన్నారు. ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ కలసాకారం అయిన అనతి కాలంలోనే ఐలమ్మను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఆమె రుణం తీర్చుకునే ప్రయత్నాలు, చర్యలు చేపట్టిందన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణను బంగారు తెలంగాణగా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆమంచి అంజయ్య, మిర్యాల యాదగిరి, దుడుకు లక్ష్మీనారాయణ, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, నాగిళ్ల మురళి, పిల్లి రామరాజు, పంకజ్ యాదవ్, కరీం పాషా, అయితగోని యాదయ్య, పగిళ్ల సైదులు, భీమనపల్లి నగేష్, చిలకరాజు చెన్నయ్య, చిక్కుల రాములు, దూదిగామ సత్తయ్య, లకడాపురం వెంకన్న, చిలుకరాజు సతీష్, రెడ్డిపల్లి సాగర్, చింతల వెంకన్న, దామునూరి శ్రీనివాస్, జంజిరాల శేఖర్, ఎలిజాల సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. పెద్ద ప్లానింగే!

● టౌన్‌ప్లానింగ్ విభాగంలో చేయి తడిపితేనే ఫైళ్ల కదలిక ● చేతికి మట్టిఅంటకుండా కిందిస్థాయి సిబ్బందితో వసూళ్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మునిసిపాలిటీల్లో పట్టణ ప్రణాళికా విభాగంలో ముడుపుల వ్యవహారం జోరుగా సాగుతోంది. చేయి తడపనిదే ఫైళ్లు కదలని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా అధికారులు నేరుగా కాకుండా సర్వేయర్ల ద్వారా కిందిస్థాయి సిబ్బందితో అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏసీబీకి చిక్కుతామోనన్న ఆందోళనతో వసూళ్లకు వారిని వినియోగిస్తున్న సమాచారం. మామూళ్లు అందుతుండటం, కొన్నిచోట్ల సిబ్బంది కొరతతో అక్రమ నిర్మాణాలు అడ్డూఅదుపు లేకుండా కొనసాగుతున్నాయి.





సర్వేయర్ల ద్వారా ముడుపులు

రామగిరి : నల్లగొండ మునిసిపాలిటీలో పట్టణ ప్రణాళిక విభాగంలో ఏపని జరగాలన్నా చేయి తడపాల్సిందే. భవన నిర్మాణం అనుగుణంగా ప్రతి ఫైల్‌కూ రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే నేరుగా తీసుకుంటే ఏసీబీకి పట్టుబడతామన్న ఉద్దేశ్యంతో తమ చేతికి మట్టి అంటకుండా ముడుపులను సర్వేయర్ల ద్వారా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. సర్వేయర్లు ఎవరికి ఎంత ఇవ్వాలనే ధర నిర్ణయించి యజమానుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ముడుపులు క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు వాటాలుగా వెళ్తుంటాయని పలువురు ఆరోపిస్తున్నారు. అంతస్తుకో రేటు నిర్ణయించి, చేయి తడిపితే చాలు నో అబ్జక్షన్ అనేస్తున్నారు. దీంతో సెట్ బ్యాక్ అనేది లేకుండా నిర్మాణాలు వెలుస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా భవనాలు

నల్లగొండలో జీ+1 వరకే అనుమతులు ఇచ్చే అవకాశం ఉంది. అంతకు మించి నిర్మాణాలకు హైదరాబాద్‌లోని రీజియన్ కార్యాలయంలో అనుమతులు తీసుకోవాలి. అయితే నిర్మాణదారులు రీజనల్ కార్యాలయంలో దరఖాస్తు చేయగా కొన్నింటిని వారు తిరస్కరిస్తున్నారు. అయినప్పటికీ దరఖాస్తును చూపి నిర్మాణాలు చేపడుతున్నారు. దేవరకొండ రోడ్డులో ఓ భవన యజమాని రెసిడెన్సియల్ అనుమతులు పొంది కమర్షియల్‌గా వ్యాపారం చేస్తున్నారు. పాతబస్తీ, హైదరాబాద్ రోడ్డు, ప్రకాశంబజార్ వంటి ప్రధాన ప్రాంతాల్లో కనీస సెట్‌బ్యాక్‌లు లేకుండా పెద్ద పెద్ద భవనాలు వెలిశాయి. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని తెలిసినా అధికారులు చోద్యం చూస్తున్నారు.

అనుమతి కొంత.. నిర్మాణం మరింత

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో 90శాతం నిర్మాణం పూర్తయిన భవనానికి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. అనుమతి కంటే ఎక్కువగా నిర్మాణం చేపడుతున్నారని అందులో పేర్కొన్నారు. అనుమతికి మించి నిర్మాణం జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరించారన్న ఆరోపణలు లేకపోలేదు. జీ+1కు అనుమతి తీసుకుని వాటిపై అదనంగా నిర్మాణాలు చేపడుతున్నారు. పెద్దపెద్ద అంతస్తులుగా నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా కనీసం అగ్ని ప్రమాద నివారణకు సంబంధించిన ప్రమాణాలు పాటించడం లేదు.

పావువంతు అక్రమ నిర్మాణాలే

సూర్యాపేటలో 48వార్డుల్లో గృహనిర్మాణాలు 38,910 ఉన్నాయి. ఏడు నెలల కాలంలో 145 భవన నిర్మాణాలు చేపట్టగా అందులో అక్రమంగా నిర్మిస్తున్న భవనాలు 38 వరకు ఉన్నాయి. అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు గతంలో టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో రెవెన్యూ, ఫైర్, పోలీస్, మునిసిపల్ శాఖలు కలిసి ఉండగా ఈ బృందం పనితీరు ఎలా ఉందో ఎవరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది.





చిక్కరు.. దొరకరు..

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)



మిర్యాలగూడ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అదనపు బాధ్యతలు, డిప్యుటేషన్లు అంటూ చిక్కరు, దొరకరని భవన నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లైసెన్స్‌డ్ ఇంజనీర్లంటే టౌన్ ప్లానింగ్ అధికారులకు అభిమానం. వీరికి మాత్రమే ఈ శాఖ అధికారులు నిత్యం అందుబాటులో ఉంటారు. సాధారణ ప్రజలు ఎవరైనా ముందుగా తాత్కాలిక ఉద్యోగిని కలవాలి, ఆ తర్వాత అటెండర్, సూపర్‌వైజర్‌ను కలవాలి. ఈ సెక్షన్‌లో ఉన్నతాధికారిని కలవాలంటే లైసెన్స్‌డ్ ఇంజనీరుతో వెళ్లాల్సిందే.

కింది స్థాయి సిబ్బందిదే హవా..

అనుమతులున్నా కిందిస్థాయి ఉద్యోగులు నిర్మాణదారులకు చుక్కలు చూపిస్తుంటారు. మిర్యాలగూడలో ప్రణాళిక విభాగంలోని చిరుద్యోగిపై ఆరోపణలు రావడంతో గత కమిషనర్ మరో శాఖకు మార్చారు. అయినప్పటికీ నెల రోజుల్లోనే యథాస్థానానికి వచ్చారు. అక్రమ నిర్మాణ పనులంటూ పారలు, గడ్డపారలు తదితర సామాగ్రి తేవడం ఇక్కడ సాధారణ విషయమే. పట్టణ ప్రణాళిక విభాగంలో చేయి తడపనిదే ఫైళ్లు కదలే పరిస్థితి లేదు. లంచాలివ్వనిదే పని జరగదు. అందిన కాడికి దోచుకోవడంతో పాటు అందని దానికి దిగువ స్థాయి ఉద్యోగులను పురమాయిస్తుంటారు.

అక్రమాలకు తావే లేదు



కార్యాలయంలో అక్రమాలకు తావేలేదు. అన్ని విభాగాలపై పర్యవేక్షణ ఉంటుంది. ఇక పట్టణ ప్రణాళిక విభాగంలో అనేక మార్పులు వచ్చాయి. నిర్మాణ అనుమతులతో పాటు ఇతర ధ్రువపత్రాలు, సర్టిఫికెట్స్‌ను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. ఈ తరుణంలో అక్రమాలకు తావుండదు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయమన్నదే లేకుండా నిర్మాణ అనుమతి పత్రాల జారీ జరుగుతోంది.

- శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

● దేవరకొండలో నోటీసులతో సరి

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ మునిసిపాలిటీలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందితేనే తప్ప పట్టణ ప్రణాళిక, మునిసిపల్ అధికారులు స్పందించడం లేదు. అది కూడా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. పట్టణంలో 20 వార్డులకు 50 వేలకు పైగా జనాభా ఉంది. 8,500 నివాసగృహాలు ఉన్నాయి. పట్టణ ప్రణాళిక విభాగంలో ఇద్దరు అధికారులకు ఒక్కరే ఉన్నారు. ఆయన కూడా మరో మునిసిపాలిటీ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారానికి రెండురోజులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. అక్రమ కట్టడాలు, కబ్జాలపై మొక్కుబడిగా నోటీసులకే పరిమితమవుతున్నారు. ఇప్పటి వరకు 10 వరకు భూఆక్రమణలు, అక్రమ కట్టడాలకు సంబంధించి నోటీసులు జారీ చేశారు. దేవరకొండలో వక్ఫ్ బోర్డు, నీటిపారుదల, మునిసిపాలిటీ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. వీటిపై పలువురు లోకాయుక్త, జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ చర్యలు శూన్యం.

అక్రమ కట్టడాలు జరిపితే చర్యలు : కమిషనర్

దేవరకొండలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా, భూకబ్జాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 10 మందికి నోటీసులు జారీ చేశాం. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటాం. త్వరలో టౌన్‌ప్లానింగ్ రెగ్యూలర్ అధికారి వస్తారు.

సుదర్శన్, దేవరకొండ మునిసిపల్ కమిషనర్

● ఆదాయ వనరుగా అక్రమ నిర్మాణాలు

భువనగిరి టౌన్: యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణంలో పట్టణ ప్రణాళిక విభాగంలో అక్రమ వసూళ్లు సాధారణంగా మారాయి. సకాలంలో ఎలాగైనా అనుమతులు కోసం భవనయజమానుల ఆత్రుతను కొద్దిమంది అధికారులు అదునుగా తీసుకుని వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడి అపార్ట్‌మెంట్స్, గేటెడ్ కమ్యూనిటీ, వాణిజ్య భవనాలు, రియల్‌ఎస్టేట్ వెంచర్స్ అనుమతులు హెచ్ఎండీఏ ఇవ్వాల్సి ఉంటుంది. కేవలం వ్యక్తిగత కుటుంబాల నివాసాలకు మాత్రమే అనుమతులు ఇచ్చే అధికారం మునిసిపాలిటీకి ఉంది. ప్రతినెలా 25 నుంచి 30 భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు వస్తుండగా ఎప్పటికప్పుడు అనుమతుల ప్రక్రియ పూర్తి చేస్తుండటంతో ఏఒక్క దరఖాస్తు పెండింగ్‌లో లేవు. ఇదిలా ఉండగా రికార్డుల ప్రకారం అనుమతులు లేని భవనాలు 30 వరకు ఉండగా క్షేత్రస్థాయిలో మాత్రం అంతకు రెట్టింపుకు పైగా ఉన్నట్లు పలువురు అంటున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు, వేధిస్తున్న సిబ్బంది కొరత

భువనగిరిలో 1,200 గజాలలోపు ఐదు అంతస్తుల వ్యక్తిగత భవనాల నిర్మాణ అనుమతులకు బిల్డ్‌నౌ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 21రోజుల్లో అనుమతులు ఇవ్వాలి, ఆలస్యమైతే వివరణ ఇవ్వాల్సిన బాధ్యత అధికారులదే. అయితే సిబ్బంది కొరతతో సకాలంలో దరఖాస్తుల పరిశీలన ఆటంకంగా మారుతోంది.నాలుగు టీపీబీవో పోస్టులకు ఇద్దరు మాత్రమే ఉన్నారు. రెండు టీపీఎస్ పోస్టులకు ఒక్కరు మాత్రమే ఉండగా ఆ ఒక్క అధికారి మరో మూడు మునిసిపాలిటీలకు ఇన్‌చార్జి. ఒక టీపీవో పోస్టుకు ఒకరు ఉన్నప్పటికీ ఆ అధికారి మరో మూడు మునిసిపాలిటీలకు ఇన్‌చార్జిగా కూడా ఉన్నారు. రెండు చైన్‌మన్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

● మోత్కూరులో అధికారే లేరు

మోత్కూరు : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి రెగ్యులర్ టౌన్ ప్లానింగ్ అధికారి లేరు. మూడు మాసాల క్రితం వారంలో ఒక రోజు ఖచ్చితంగా మోత్కూరులో ఉండాలని ఓ టౌన్ ప్లానింగ్ అధికారికి ఇన్‌చార్జి ఇవ్వగా ఆయన రాలేదు. ఆ తర్వాత నెల రోజుల క్రితం మరో అధికారికి వారంలో మూడు రోజులు ఉండాలని ఇన్‌చార్జి ఇవ్వగా ఆయన కూడా రావడం లేదు. అనుమతుల్లేని నిర్మాణాలు అడ్డుకోవడంతో పాటు వెంచర్లలో 10 శాతం భూమి కబ్జాకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత టీపీవోదే. మోత్కూరు మునిసిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ అధికారి లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కాక రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు తెలిపారు.

గుట్ట పవిత్రతకు భంగం కలిగిస్తే కఠినచర్యలు



కార్డెన్‌సెర్చ్ వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ శ్రీనివాస్ నాయుడు హెచ్చరించారు. రాచకొండ సీపీ, భువనగిరి డీసీపీ అక్షాంష్‌యాదవ్ ఆదేశం మేరకు బుధవారం యాదగిరిగుట్టలోని పాతగుట్టరోడ్డు, ప్రశాంత్‌నగర్ ప్రాంతాలతో పాటు ఎనిమిది లాడ్జీల్లో కార్డెన్‌సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. పుణ్యక్షేతంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అప్పుడే పూర్తిస్థాయిలో కార్యకలాపాలను అరికట్టడం సులభతరం అవుతుందన్నారు. క్షేత్ర పవిత్రతకు భంగం కలుగకుండా చర్యలు తీసుకోవచ్చునన్నారు. పట్టణంలో ఎవరైనా అనుమానితులు తారసపడినా, గంజాయి, డ్రగ్స్ విక్రయించినా, తాగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్డెన్ సెర్చ్‌లో ఐదుగురు సీఐలు, 10మంది ఎస్ఐలో మొత్తం 129 మంది సిబ్బంది పాల్గొన్నారని, 29 ద్విచక్రవాహనాలు, ఆరు ఆటోలు, కారు, రూ.18వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. ముగ్గురు రౌడీషీటర్లు, 11 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సీఐలు మాదాను శంకర్‌గౌడ్, బొడ్డుపల్లి భాస్కర్‌తో పాటు మరికొంతరు సీఐలు, ఎస్ఐలు యాదయ్య, సిద్దులు, సుధాకర్, రూపశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

చిట్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల పెద్దబావిగూడెం కాలనీలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిట్యాలకు చెందిన యానాల మోహన్‌రెడ్డి కుమార్తె సంతోష(37)కు యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం చిందోనిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. పిల్లలు చిట్యాలలో చదువుకుంటుండటంతో ఆమె కూడా ఇక్కడే ఉంటుంది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరివేసుకుంది. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

బొలేరో వాహనం దగ్ధం



చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారు హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై బుధవారం బొలేరో వాహనం దగ్ధమైంది. కారు డ్రైవర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని అంబర్‌పేట నుంచి విజయవాడకు పేపరు లోడ్‌తో వెళ్తున్న బొలేరో వాహనం దండుమల్కాపురం వద్దకు రాగానే ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్ నాగరాజు వాహనాన్ని రోడ్డు పక్కకు తీసుకువచ్చి నిలిపివేశారు. పేపరు లోడ్ కావడంతో మంటలు క్షణాల్లో అంటుకున్నాయి. చూస్తుండగానే వాహనం మంటల్లో దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు నాగరాజు తెలిపారు.

వెలుగుపల్లిలో క్లినిక్ సీజ్



ఆసుపత్రిని సీజ్ చేసినట్లు పత్రాలు అందజేస్తున్న అధికారులు

తుంగతుర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌ను జిల్లా వైద్యాధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి సీజ్ చేశారు. గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా సర్గం సంపత్ కుమార్ శ్రీసంజీవని మెడికల్ అండ్ జనరల్‌స్టోర్ నడిపిస్తున్నట్లు తమకు సమాచారం రావడంతో తనిఖీ నిర్వహించామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జయమనోరి, డాక్టర్ జి.చంద్రశేఖర్ తెలిపారు. సంపత్ కుమార్ తన అర్హతకు మించి ఇంజెక్షన్లు, గ్లూకోజ్‌లు రోగులకు అందిస్తున్నట్లు గుర్తించామన్నారు. రిజిస్టర్లను, రిఫరల్ స్లిప్పులను స్వాధీనం చేసుకొని క్లినిక్‌ను సీజ్ చేశామన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా నడిపిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాజియా, జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి అశ్రిత పాల్గొన్నారు.

టెంకాయ టెండర్ల 'వేలా'కోలం!

● టెండర్ డబ్బులు పూర్తిగా చెల్లించని వేలందారులు

● తాజాగా బకాయి చెల్లించనందుకు సీజ్ నోటీస్

● చివరకు పోలీస్ స్టేషన్‌కు చేరిన వివాదం



(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీలో కొబ్బరికాయల విక్రయ వేలం బకాయిల వసూలు వివాదాస్పదంగా మారుతున్నాయి. ఏడాది కాలపరిమితికి గాను ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో కొబ్బరికాయల విక్రయ హక్కులను వేలం ద్వారా దక్కించుకుంటున్న టెండరుదారులు చివరకు నష్టాల నెపంతో వేలం డబ్బులను పూర్తిగా చెల్లించకుండాపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2022 ఆర్థిక సంవత్సరం నుంచి 2025 ఆర్థిక సంవత్సరం వరకు వరుస మూడోసారి ఇదే తరహా పునరావృతమమైంది. తాజాగా ఈ నెల 28తో టెండర్ కాలపరిమితి ముగుస్తుంది. దీంతో టెండర్ బకాయి డబ్బులు పూర్తిగా చెల్లించలేదనే కారణంతో పంచాయతీ కార్యదర్శి చిరుమర్తి వెంకన్న కొబ్బరికాయల విక్రయ కేంద్రాన్ని మంగళవారం సీజ్ చేసేందుకు చేసిన ప్రయత్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు వరకు వెళ్లింది. ఈ నెల 28 వరకు కాలపరిమితి కింద ఎల్లారెడ్డిగూడెంలో కొబ్బరికాయల విక్రయ హక్కును వేలంలో ఇదే గ్రామానికి చెందిన కల్లూరి శ్రీనివాస్ రూ.68,50,000 అత్యధిక పాట పాడి చేజిక్కించుకున్నాడు. కాగా రూ.48.40లక్షలు చెల్లించారు. మిగతా డబ్బులు రూ.12,10,000లకు జామీనుగా తన 200 గజాల ప్లాట్‌ను గ్రామపంచాయతీ పేరిట సేల్ డీడ్ చేశాడు. ఐతే ఈ నెల 28వ తేదీతో వేలం హక్కు కాలపరిమితి పూర్తవుతుందని మిగతా రూ.12,10,000ల బకాయి డబ్బులు చెల్లించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి చిరుమర్తి వెంకన్న ఇప్పటికే మూడు పర్యాయాలు టెండర్‌దారునికి నోటీసులు జారీ చేశారు. అయినా స్పందన రాకపోవడంతో మంగళవారం సీజ్ నోటీసును జారీ చేసి టెంకాయల విక్రయగోదాముకు తాళం వేసేందుకు ప్రయత్నించగా టెండర్ మద్దతుదారులు అడ్డుకున్నారు. దీంతో వెంకన్న నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అధికారులే మాట తప్పారు

కొబ్బరికాయల విక్రయహక్కు పొందిన సమయంలో అధికారులు నాకిచ్చిన మాట తప్పారు. దీంతో మేం నష్టపోయాం. నిబంధనల మేరకు తొలుత రూ.48.40లక్షల నగదును గ్రామకార్యదర్శికి అందజేశా. అయితే ఎల్లారెడ్డిగూడెం నుంచి చెర్వుగట్టుకు వెళ్లేదారిలో ఓ వ్యాపారి నా వద్ద కొబ్బరికాయలు కొనకుండా ఇతరప్రాంతాల నుంచి తెచ్చి విక్రయిస్తున్నాడని అధికారులకు చెప్పాం.మిగతా రూ.12.10లక్షలు చెల్లిస్తే సదరు వ్యాపారికి నోటీసు జారీ చేసి సమస్య లేకుండా చేస్తామని వారు హామీఇచ్చారు. అందుకోసం 200గజాల ప్లాట్‌ను పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేశా. కానీ ఆ వ్యాపారి నా వద్ద కొబ్బరికాయలు కొనేలా చేయకపోగా మరో వ్యాపారిని తోడు చేసుకున్నాడు. దీంతో నెలకు రూ.లక్ష చొప్పున నష్టపోయాం. మరో మూడు నెలల అదనపు సమయమిస్తే బకాయి రూ.12.10లక్షలు చెల్లించేందుకు సిద్ధం. లేదంటే మేం చేసిన సేల్‌డీడ్ చేసిన ప్లాట్‌ను జీపీ స్వాధీనం చేసుకోవచ్చని చెబుతున్నాం. అదేవిధంగా గతంలో బకాయిపడిన టెండర్‌దారుల నుంచి డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

కల్లూరి శ్రీనివాస్, టెండర్‌దారుడు

సీసీ కెమెరాలతో ఆకతాయిలకు చెక్



కేతేపల్లి జడ్పీ పాఠశాల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

కేతేపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తూ పాఠశాలలో నాలుగు సీసీకెమెరాలను ఏర్పాటుచేశారు. ఆకతాయిలు పాఠశాల ఆవరణలోని తాగునీటి నల్లాలు, మరుగుదొడ్లు, తరగతి గదుల తలుపులు, కిటికీలను కొంతకాలంగా ధ్వంసం చేస్తున్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వెంట గల చర్చి వెనక వైపున ఉన్న ఉన్నత పాఠశాల ఆవరణలోనే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎంఈవో కార్యాలయం, భవితకేంద్రం ఉన్నాయి. మూడువైపులా ప్రహరీ ఉండి మరోవైపు ప్రహరీ నామమాత్రంగా ఉంది. పాఠశాలల పని వేళలు ముగియగానే మెయిన్ గేటుకు తాళం వేస్తారు. పాఠశాలకు వాచ్‌మన్ లేకపోవడంతో సాయంత్రం వేళల్లో గోడలు, గేటు దూకి ఆవరణలోకి ప్రవేశించే స్థానిక ఆకతాయిల మూక తమ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. ఈ క్రమంలో వీరికి అడ్డుకట్ట వేసేందుకు ఇటీవలి వరకు ప్రధానోపాధ్యాయుడిగా వ్యవహరించిన యానాల నర్సిరెడ్డి ప్రయత్నాలు ఫలించాయి. పాఠశాల పూర్వవిద్యార్థులు ఇరువురి సహకారంతో బుధవారం పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థి కేతేపల్లికి చెందిన బందనాథం ఆరోగ్యం రూ.12వేలతో నాలుగు సీసీ కెమెరాలు సమకూర్చాడు. ఇదే పాఠశాలలో చదువుకుని సీసీకెమెరాలు బిగించే పనులు చేస్తున్న నోముల రమేష్ ఉచితంగా వాటిని బిగించడమేగాక అందుకు అవసరమైన రూ.2వేల విలువైన పరికరాలు సమకూర్చారు. దీంతో బుధవారం నుంచి కేతేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల సీసీ కెమెరాల నిఘాలోకి వచ్చినట్లయ్యింది. పూర్వ విద్యార్థులు ఆరోగ్యం, రమేష్‌లను పాఠశాల ప్రస్తుత, గత హెచ్ఎంలు వీ.రఘు, యానాల నర్సిరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

పాడిరైతుల సంక్షేమమే ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట ప్రాంతాల్లో త్వరలో బీఎంసీయూ (మినీ శీతలీకరణకేంద్రాలు) ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. వీటిపరిధిలో 100వరకు సొసైటీలు ఏర్పాటుచేస్తాం. పాతసొసైటీలకు ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జిలను నియమించి, త్వరలో ఎన్నికలు నిర్వహిస్తాం. పాలకవర్గాలను ఏర్పాటు చేస్తాం. తద్వారా పాడిరైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తాం. బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు, సబ్సిడీపై దాణా, మినరల్స్ అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో చివ్వెంల, వలిగొండ, కొండమల్లేపల్లిల్లో బీఎంసీయూలు ఉన్నాయి. వీటిద్వారా ప్రస్తుతం 20వేల లీటర్ల వరకు పాలసేకరణ జరుగుతోంది. దీన్ని త్వరలో 50వేల లీటర్లకు పెంచేలా ప్రణాళికతో పనిచేస్తున్నాం.

మెగాడెయిరీతోపాటు, అన్ని పాతడెయిరీలను ఆధునీకరిస్తాం

మెగాడెయిరీ ఏర్పాటు చేయడంతో పాటు, ఫెడరేషన్ పరిధిలో 12 ప్రాంతాల్లో ఉన్న పాత డెయిరీలన్నింటినీ ఆధునికరిస్తాం. అందులో భాగంగా ఖమ్మం, నిజామాబాద్, వరంగల్‌లోని డెయిరీల ఆధునికీకరణకు దాదాపుగా రూ.6.50కోట్లతో పనులు చేపడుతున్నాం. డెయిరీలను ఆధునీకరించడం ద్వారా పాలను అక్కడికక్కడే ప్రాసెసింగ్ చేస్తే ఖర్చు తగ్గి, ఆదాయం పెరుగుతుంది. ఖమ్మం, హైదరాబాద్ వంటి నగరాల్లో ఉన్న ఫెడరేషన్ గోదాములు, స్థలాలను హైపర్ మార్కెట్లకు లీజుకు ఇకివ్వడం, షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించడం ద్వారా ఆదాయం వచ్చేలా చూస్తున్నాం.

పాలు, డెయిరీ ఉత్పత్తుల విక్రయాలు పెంచేందుకు ప్రణాళిక

గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల్లో విజయ డెయిరీ పార్లర్లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్నవాటికి తోడు మరో 100త్వరలో ఏర్పాటు చేస్తాం. అన్ని నగరాలు, పట్టణాల్లో విస్తృతంగా పార్లర్లు ఏర్పాటు చేస్తాం. పాలసేకరణ కేంద్రాల వద్ద కూడా డైరెక్ట్ సేల్స్ పెంచుతున్నాం. నల్లగొండ, మల్కాజిగిరి, రంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణాలతో పాటు, నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడ మునిసిపాలిటీల్లో పార్లర్ల ఏర్పాటుకు మునిసిపాలిటీలు స్థలాలు ఇచ్చేందుకు అంగీకరించాయి. వాటిని త్వరలో ఏర్పాటు చేస్తాం.

సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో

పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయిన దశలో ఉన్న విజయ డెయిరీని లాభాల్లోకి తీసుకురావడమే గాక మరింత వృద్ధి సాధించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు పూర్తి మద్దతుగా నిలిచారు. వారి మద్దతు, సహకారంవల్లే డెయిరీని ఏడాది కాలంలో రూ.200కోట్ల నష్టాల దశ నుంచి లాభాల దశకు తీసుకురాగలిగాం. భవిష్యత్‌లో 6లక్షల లీటర్ల పాలసేకరణ దశకు చేరుతాం. రూ.750కోట్ల టర్నోవర్‌ను రూ.1500కోట్లకు పెంచడమే మా ముందున్న లక్ష్యం.

వివాహితపై అత్యాచారయత్నం

ఆత్మకూరు(ఎస్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో వివాహితపై అత్యాచారయత్నం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 5న ఓ గ్రామంలో వివాహితపై కనుకుంట్ల లింగయ్య అనే వ్యక్తి దాడిచేసి రూమ్‌లోకి లాక్కెళ్లి అత్యాచారయత్నం చేశాడు. గమనించిన ఆమె కుమారుడు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి రక్షించారు. దీంతో లింగయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితురాలు వెనకాడటంతో వీహెచ్‌పీఎస్ నాయకులు ధైర్యంచెప్పి, అండగా నిలబడ్డారు. వారి సహకారంతో బుధవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. తెలిపారు.

బాలికపై లైంగికదాడి

నల్లగొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడగా అతడిపై పోక్సో కేసు నమోదైంది. ఈ ఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో జరిగింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17ఏళ్ల దళిత బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ నెల 5న గ్రామంలో వినాయకశోభాయాత్ర సాగుతుండగా గ్రామా నికి చెందిన యువకుడు బాలిక ఇంటికి వెళ్లి ఆమెపై లైంగికదాడికి ఒడిగట్టాడు. ఈ క్రమంలో బాలిక కేకలు వేయటంతో కుటుంబ సభ్యులతో పాటు ఇరుగుపొరుగు వారు గమనించారు. వెంటనే నిందుతుడిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు యువకులు బాధితురాలి కుటుంబ సభ్యులను బెదిరించి నిందుతుడిని అక్కడి నుంచి తప్పించారు. బుధవారం బాధితురాలి తల్లిండ్రులు పోలీసులను ఆశ్రయించగా నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేసినట్లు తెలిపారు. బాధితురాలి తల్లిదండ్రులను బెదిరించి నిం దుతుడిని తప్పించిన ఇద్దరు యువకులపై కూడా కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భూములు లాక్కుంటే ఊరుకోం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న సాంబశివరావు

మునుగోడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిబుల్‌ఆర్) ఏర్పాటు కోసం ప్రభుత్వం రైతులను ఒప్పించకుండా భూములను బలవంతంగా తీసుకుంటామంటే ఊరుకోబోమని సీపీఐ శాసనసభ పక్షనేత, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)కు అన్ని ప్రాంతాల్లో సమాన దూరంలో ఏర్పాటు చేయాల్సిన ట్రిబుల్‌ఆర్‌ను ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా అలైన్‌మెంట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్ పరిసర ప్రాంతానికి ఉత్తర, దక్షిణ భాగంలో అమాంతం సుమారు 10కిలోమీటర్ల దూరాన్ని తగ్గించి అలైన్‌మెంట్‌ను క్రాసింగ్ చేశారని రైతులు చేసే ఆరోపణలు వాస్తవమే అన్నారు. పారిశ్రామిక కంపెనీల మేలు కోసం ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ క్రాసింగ్ చేయడంతో పేద రైతులు భూములు కోల్పోయే దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దల భూములు కాపాడటం కోసం పేదల భూములు కోల్పోయేలా మోసపూరితంగా వ్యవహరిస్తే సహించబోమని హెచ్చరించారు. ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ క్రాసింగ్ పై పునరాలోచన చేయాలని, భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ విలువల ప్రకారం నష్టపరిహారం పదింతలు పెంచి చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఏఐటీయూసీ, పీఎన్ఎం నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, పల్లె నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అమర వీరుల ఆశయ సాధనకు కృషిచేయాలి

సంస్థాన్‌నారాయణపురం: ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన అమరుడు కప్పల నర్సింహ ఆశయ సాధన కోసం కృషిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం జనగాం సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి కప్పల నర్సింహ ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని సంబశివరావుతో పాటు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి పరామర్శించారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు పనిచేసిన నిజమైన కమ్యూనిస్టు నర్సింహ అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు, జిల్లా కమిటీ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, అంజాచారి, పల్లె నర్సింహ, మహ్మద్ రహమాన్, కలకొండ సంజీవ, మంచాల జంగయ్య, బైకాని రాజు, లోడే యాదయ్య, కొండూరు స్వామి పాల్గొన్నారు.

కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు

మునుగోడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాలకు హాని కలిగించే కల్తీ సరుకులతో నాణ్యతలేని ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నల్లగొండ ఫుడ్ సేఫ్టీ అధికారి నిమ్మల శివశంకర్‌రెడ్డి హెచ్చరించారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలోని చౌటుప్పల్ రోడ్డులో ఉన్న ఓ స్వీట్ షాపులో బుధవారం చేశారు. షాపులో విక్రయానికి ఉంచిన వివిధ సరుకులు, ప్రధానంగా ఆహార పదార్థాలను పరిశీలించారు. శుభ్రత పాటించకుండా సరుకులు విక్రయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తయారీ కోసం సిద్ధంగా ఉంచిన పిండి పదార్థాలు కుళ్లిపోవడంతో చెత్తబుట్టలో వేయించారు. వినియోగదారుడి పిర్యాదు మేరకు షాపు తనిఖీ చేశామని, కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.



మునుగోడులోని స్వీట్ షాపును తనిఖీచేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారి శివశంకర్‌రెడ్డి

యూరియా దొరకదు.. కష్టాలు తీరవు

● తెల్లవారుజాము నుంచే పీఏసీఎస్‌ల వద్ద రైతుల బారులు ● యూరియా అందక పలుచోట్ల రాస్తారోకోలు



అర్వపల్లి పీఏసీఎస్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళా రైతులు

యూరియా కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. పీఏసీఎస్‌ల వద్ద తెల్లవారుజాము నుంచే బారులు తీరుతున్నారు. పనులు మానుకొని బస్తా యూరియా కోసం పరుగులు పెడుతున్నారు. చెప్పులు, పాస్ పుస్తకాలను క్యూలైన్లలో పెట్టి ఎదురుచూస్తున్నారు. చాలా చోట్ల యూరియా రాకపోవడంతో ఆందోళన చేశారు. పోలీసుల పహారాలో యూరియా పంపిణీ చేశారు.

తుంగతుర్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): యూరియా రాకపోవడంతో రైతులు పాట్లు పడుతున్నారు. బుధవారం ఉదయమే పీఏసీఎస్ వద్ద క్యూలో ఉన్నారు. 440 బస్తాల యూరియా రావడంతో సుమారుగా 600 మంది బస్తాల కోసం ఎదురు చూశారు. వచ్చిన యూరియా రైతులకు పూరిస్థాయిలో అందకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల యూరియా కష్టాలు

అర్వపల్లి: యూరియా కోసం రైతులు కష్టాలు పడుతున్నారు. రెండు రోజుల నుంచి పడిగాపులు కాస్తుండడంతో బుధవారం అర్వపల్లి పీఏసీఎస్ కేంద్రానికి యూరియా లోడు రావడంతో రైతులు బారులు తీరి యూరియా బస్తాలను తీసుకెళ్లారు. పోలీసుల పహరాలో యూరియాను రైతులకు అందజేశారు.

యూరియా కోసం తిప్పలు

మాడ్గులపల్లి: నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండకేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఆధార్‌కార్డుకు ఒకటే బస్తా ఇస్తామంటూ అధికారులు చెప్పడం, సరిపడా యూరియా రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియాను అందించాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని వ్యవసాయాధికారులతో మాట్లాడారు. యూరియాను సక్రమంగా అందిస్తామని సర్ధిచెప్పడంతో ఆందోళన విరమించారు.

తెల్లవారకముందే రైతులు క్యూ

ఆత్మకూరు(ఎస్): సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలోని ఆత్మకూరు(ఎస్)లోని పీఏసీఎస్, మండలంలోని నెమ్మికల్‌లోని మన గ్రోమోర్, ఏపూర్ శ్రీసాయి ఫర్టిలైజర్ షాపు వద్ద పోలీస్ పహారా మధ్య బుధవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఆత్మకూరు(ఎస్) మండలానికి 75మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఆత్మకూర్ పీఏసీఎస్‌కు 20టన్నులు, ఏపూర్ శ్రీసాయి ఫర్టిలైజర్ దుకాణానికి 25టన్నులు, నెమ్మికల్ మన గ్రోమోర్‌కు 30 టన్నులు యూరియా వచ్చింది. తెల్లవారకముందే రైతులు క్యూలైన్ కోసం రైతు పాస్ పుస్తకాలు, కవర్లు, చెప్పులు వరుసలో పెట్టి యూరియా కోసం ఎదురు చూశారు. సూమారుగా 400 మీటర్ల వరకు నెమ్మికల్ సొసైటీ వద క్యూలైన్‌గా తమ వెంట తెచ్చుకున్న వస్తువులను ఉంచారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. మన గ్రోమోర్ షాపు నిర్వా హకులు యూరియాతో పాటుగా పురుగుమందుల డబ్బాలను ఇచ్చే ప్రయత్నం చేయగా రైతులు ఆందోళనకు దిగారు. దీంతో వారు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఏపూర్‌లో యూరియా పంపిణీ చేస్తున్న సమయంలో రైతుల మధ్యతోపులాట జరగడంతో పోలీసులు వచ్చి నచ్చజెప్పి సముదాయించారు. అనంతరం పోలీసులు పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేశారు.

పోలీస్ పహారాలో యూరియా పంపిణీ

చింతపల్లి: నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు వద్ద యూరియా కోసం బుధవారం రైతులు బారులు తీరారు. తొలుత చెప్పులు క్యూలైన్లో పెట్టిన రైతులు సరిపడా యూరియా దొరకకపోవడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న చింతపల్లి ఎస్ఐ రాంమూర్తి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు యూరియాను పంపిణీ చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ పంటలు వేసి నెల రోజులు కావుస్తున్నా సకాలంలో యూరియా వేయకపోవడంతో పంటలకు నష్టం జరిగే ప్రమాదం నెలకొందన్నారు. యూరియా వేస్తేనే పైరు ఎదిగి దుబ్బు కడితేనే దిగుబడి వస్తుందని వారు తెలిపారు. వందల సంఖ్యలో రైతులు వస్తే సగం మందికి యూరియా దొరకడంతో రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

పైరవీకారులకే ఇస్తున్నారని..



మఠంపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

మఠంపల్లి: రాజకీయ పలుకుబడి వారికే యూరియా ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తెల్లవారుజామున నుంచి పడిగాపులు కాసిన యూరియా పంపిణీ చేయడంలో అధికారులు, మన గ్రోమోర్ సెంటర్ నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ సూర్యాపేట జిల్లా మఠంపల్లిలో రైతులు ఆందోళన చేశారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి రైతులను చెదరగొట్టారు. మన గ్రోమోర్ సెంటర్‌కు బుధవారం యూరియా కట్టలు వచ్చాయి. దీంతో యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఉదయం ఐదు గంటలకే పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జీరాక్స్‌లను క్యూలో పెట్టారు. గంటల తరబడి రైతులు నిలబడితే కట్ట యూరియా లభించిందని రైతులు వాపోతున్నారు. మునుపెన్నుడూ లేని విధంగా యూరియా కోసం అరిగోస పడుతున్నామని రైతులు చెప్పారు. పీఏసీఎస్ కార్యాలయం, గ్రోమోర్ సెంటర్‌ల వద్ద పడిగాపులు కాస్తున్నామని పేర్కొన్నారు.

యూరియా బ్లాక్‌దందా చేస్తున్నారని..



తిప్పర్తిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

తిప్పర్తి: యూరియా కొరతను నిరసిస్తూ నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రంలో రైతులు అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో బుధవారం రాస్తారోకో చేశారు. వచ్చిన యూరియాను దుకాణాదారులు బ్లాక్ దందా చేస్తున్నారని ఆరోపించారు. నెల రోజులుగా యూరియా కోసం ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. రోడ్డుపైన రైతులు 10 నిమిషాలపాటు బైఠాయించడంతో ఇరుపక్కలా రోడ్లపై వాహనాలు నిలిచాయి. పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారి వచ్చి రైతులతో మాట్లాడారు. అందరికీ యూరియా ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

నిద్రాహారాలు మాని..



మన గ్రోమోర్ వద్ద గుమిగూడిన రైతులు

మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండలకేంద్రంలోని గ్రోమోర్‌కు 1100 బస్తాల యూరియా వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న రైతులు పెద్దసంఖ్యలో వచ్చి యూరియా కోసం క్యూ కట్టారు. గణపవరంలో రోడ్‌లో ఉన్న రైతు వేదిక వద్ద వ్యవసాయ అధికారులు ఆధార్ కార్డుకు రెండు యూరియా బస్తాలు చొప్పున రసీదులు పంపిణీ చేస్తామని చెప్పడంతో క్యూలో ఉన్నారు. ఆ రశీదులతో కిలో మీటర్ దూరం ఉన్న గ్రోమోర్ గోడామ్ వద్ద యూరియా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో ఉంటే యూరియా రెండు బస్తాలే దొరికిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. నిద్రాహారాలు మాని వస్తే యూరియా దొరకడం గగనమైందని చెప్పారు.

ప్రజాఉద్యమ నాయకుడు సురవరం



సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రజల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించిన ప్రజాఉద్యమ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో నిర్వహించిన సీపీఐ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి, నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు.సుధాకర్‌రెడ్డి విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులై నల్లగొండ ఎంపీగా రెండు సార్లు పనిచేశారని, వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేసినా ఏనాడూ వ్యక్తిగత విమర్శ చేసుకోలేదని గుర్తు చేశారు. ఫ్లోరైడ్‌ప్రాంతమైన నల్లగొండ జిల్లాకు సాగు, తాగునీరు సాధించేందుకు కమ్యూనిస్టుల పోరాటానికి ఎప్పుడూ సంఘీభావం తెలిపేవాడినన్నారు.

పేదల గళాన్ని వినిపించిన నేత: మంత్రి

దేశంలోని కార్మికుల, కర్షకుల కోసం పార్లమెంట్‌లో తన గళాన్ని విప్పిన గొప్ప కమ్యూనిస్టు మేధావి సుధాకర్‌రెడ్డి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కామ్రేడ్ అంటే వంద మందితో సమానమని ఒక్కడు ఉన్నా ఎర్రజెండాతో అన్యాయాన్ని ప్రశ్నిస్తారని గుర్తుచేశారు. కమ్యూనిస్టులు అంటే తనకు ఎంతో గౌరవం అని వారు చేసే పోరాటం, ఆరాటం ఎప్పటికీ పదవుల కోసం కాదని పేద ప్రజల కోసమేనన్నారు. జిల్లా కేంద్రంలో సుధాకర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుతో పాటు ఓ మంచి కార్యక్రమానికి పేరు పెట్టేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు.

ఉద్యమాలకు నేతృత్వం: కూనంనేని

ప్రజాజీవితంలో ఎన్నోఉద్యమాలకు నేతృత్వం వహించి చారిత్రిక ఉద్యమ విజయాలను చవిచూసిన సురవరం సుధాకర్‌రెడ్డి ప్రజా ఉద్యమ దిక్సూచి అని సీపీఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్యార్థి దశ నుంచే ధిక్కార స్వరంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన సురవరం అంచెలంచెలుగా ఎదిగి కమ్యూనిస్టు పార్టీలో అత్యున్నత స్థాయికి చేరారన్నారు. ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డిలు మాట్లాడుతూ దేశ ప్రజలు సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండాలని దోపిడీ లేని సమసమాజ స్థాపన కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. ఆయన ఆశయసాధన కోసం ఎర్రజెండాలు కలిసి ఐక్యఉద్యమాలు నడిపేందుకు సిద్ధం కావాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక సుధాకర్‌రెడ్డి మరణం అన్నివర్గాల ప్రజలకు తీరంలోటన్నారు. ప్రశ్నించడం కమ్యూనిస్టుల ద్వారా నేర్చుకోవాలని నల్లగొండ పార్లమెంట్ సభ్యులుగా సురవరం సుధాకర్ రెడ్డి జిల్లా సమస్యలపై పార్లమెంట్‌లో ప్రభుత్వాలకు ప్రశ్నల వర్షం కురిపించిన గొప్ప మేధావి అని నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, జిల్లా సహాయ కార్యదర్శిలు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్ కుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాస్, పల్లె నరసింహ, నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఉజ్జిని యాదగిరిరావు, పబ్బు వీరస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, నరసింహ, వెంకటేశ్వర్లు, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

త్రిపుల్‌ఆర్ మాకొద్దు

గట్టుప్పల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): త్రిపుల్‌ఆర్ మాకు వద్దని, మా భూములు మాకు కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలకేంద్రంలో ట్రిబుల్‌ఆర్ రోడ్డు వద్దు అని మా భూములు మాకు కావాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ట్రిబుల్‌ఆర్‌తో సారవంతమైన భూములు రైతులు కోల్పోతున్నారని శ్రీశైలం ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు తెలవకుండా రూపొందించిన అలైన్మెంట్ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కట్ట నరసింహ,సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్, వెంకటేశం, శ్రీనివాస్, శ్రీశైలం, శంకర్, ఇడెం కైలాసం పాల్గొన్నారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032. **నిర్వాహక కార్యాలయం:** 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బీరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, ఠానే బేలాపూర్ రోడ్,మన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న ఋణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన ఋణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని ఋణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని ఋణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించుటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం తేది: 22.09.2025 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 5-4-87,88,రెండవ అంతస్తు,హరిదీప్ సిల్క్స్ ప్రక్కన,ప్రకాశం బజార్,నల్గొండ -508001 .

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
NLGNDPJ2503030013	VALIKI MAHESH	HALYAPJ2412190006	GANESH KELAVATH
NLGNDPJ2503030014	LINGASWAMY PERAPAKA	NLGD2PJ2503210005	MALLESH BOMMA
NAKRLPJ2503040011	NARSIMHA MEDA	DEVKDPJ2503220005	ROJA AMBOTHU
MRLG2PJ2503040005	NARAHARI PAGIDI	DEVKDPJ2503220004	ROJA AMBOTHU
MRLG2PJ2503040003	ARUNA EDLA	HALYAPJ2503240010	SURESH DUBBA
HALYAPJ2503040007	KRISHNAMURTHY RAMAVATH	MRLG2PJ2503240006	VALLEPU RAMESH
NAKRLPJ2503060007	LINGA REDDY MANDADI	MRLG2PJ2412240005	HANUMANTU RAMAVATH
DEVKDPJ2503060001	KUMBHAM SHEKHARGOUD	HALYAPJ2503240007	PARASURAMULU MAMIDI
MRLG2PJ2503070004	THANNEERU NARASIMHA	MRLG2PJ2503280007	AVIRENDLA VENKATANARSAMMA
MRLG2PJ2503080004	VENKATESWARLU POLAGANI		
NLGNDPJ2503080002	VADDEPALLI VIJAY KUMAR	NAKRLPJ2501010004	VEERASWAMY PADISHALA
NLGD2PJ2503120001	PERLA SRINU	MRLG2PJ2501020003	VINAYKUMAR THAKKELLA
NLGNDPJ2503130012	SAIDULU CHINTHA	MRLGDPJ2503050012	SRINIVAS PUTTALA
HALYAPJ2503140002	RAVI SUNKARABOINA	MRLGDPJ2503270001	DHANAVATH THULASIRAM
MRLG2PJ2503190005	VENKATESWARLU POLAGANI	MRLGDPJ2503270006	MAHESH BANTU
NLGD2PJ2503190003	VENKAT REDDY ROKKAM		

వేలం తేది: 22.09.2025 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 1-4-249,మొదటి అంతస్తు,కూడా రోడ్,కొత్త బస్టాండ్ దగ్గర,సూర్యపేట,సూర్యపేట జిల్లా -508213 .

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
HUZRNPJ2503080012	ANIL TUMMAKOMMA	SRYPTPJ2503170005	KODADALA HARIKRISHNA
HUZRNPJ2412100006	SATISH NAKKA	HUZRNPJ2503200008	BHIMA PANUGOTHU
HUZRNPJ2412100005	NAGESWARARAO GANGADARI	SRYPTPJ2412240009	UNPENDRACHARI KOMARA
		SRYPTPJ2503240003	SRINU PALELLI
SRYPTPJ2503110001	KRISHNA NEELAM	SRYPTPJ2503250002	GANESH KARINGULA
HUZRNPJ2503150001	PANDU BANOTHU	SRYPTPJ2503250003	GANESH KARINGULA
HUZRNPJ2503150005	SAIDULU GUNDEPANGU	SRYPTPJ2503270003	MANI JALAGAM
HUZRNPJ2412160004	SUSEELA VANKUDOTU	HUZRNPJ2503270004	VINAY PANDHIPOTU

వేలం తేది: 22.09.2025 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 1-8-301 ,మొదటి అంతస్తు, APSRTC బస్టాండ్ దగ్గర,హనుమకొండ రోడ్,భువనగిరి,యాదాద్రి భువనగిరి-508116 .

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
MTHKUPJ2503040012	JHONY SOORARAM	VLIGNPJ2503150008	MANTHRI NAGESH
MTHKUPJ2503050002	UPENDAR KORUKOPPULA	VLIGNPJ2503270004	SUNKI SREEMAN
VLIGNPJ2503080004	SUNKI SREEMAN	BHONGPJ2503270002	THUMMETI PANDU

వేలం తేది: 25.09.2025 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 1-8-301 ,మొదటి అంతస్తు, TGSRTC బస్టాండ్ దగ్గర,హనుమకొండ రోడ్,భువనగిరి,యాదాద్రి భువనగిరిజిల్లా,తెలంగాణ.

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
ALERPJ2412020001	SUGUNA KALAKUNTLA	ALERPJ2503240004	BOMMELA RAJU
ALERPJ2412120005	ETTABOINA PRABHAKAR	ALERPJ2503250003	CHINTHAKINDI SREENIVAS
ALERPJ2412160006	ARE BHANU PRASAD	ALERPJ2503260010	CHOWDABOINA KANAKAIAH
ALERPJ2503170043	ALETI CHANDRAMOULI	ALERPJ2503270004	SANDHYA BYRAPAKA
ALERPJ2503170042	ALETI CHANDRAMOULI	ALERPJ2503280002	KISHORE DONKENA
ALERPJ2503170039	SUDHAKAR GEESE	ALERPJ2503280001	KISHORE DONKENA
ALERPJ2503180001	KAMMAMPALLY SATHISH KUMA	ALERPJ2503280006	KAVITHA ERASARAPU
		ALERIP2412300001	VALLEPU RAVI

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ టి.పురుషోత్తమ్ ఏరియా హెడ్ ను** సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిభంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 11.09.2025 | **సం/- అధీకృత అధికారి**
స్థలం: మిర్యాలగూడ | **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

తక్కువ వడ్డీకే రాయితీ రుణాలు

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నాబార్డు రిఫైనల్స్ ద్వారా మహిళా సంఘాలకు అతి తక్కువ వడ్డీకే రాయితీ రుణాలు ఇస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బుధవారం నాబార్డు, టీజీ క్యాబ్ సౌజన్యంతో అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజీటీఎంఎస్‌ఈ కింద రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో ఉందని త్వరలోనే పూర్తవుతుందని పేర్కొన్నారు. తద్వారా సీజీటీఎంఎస్ స్కీం ద్వారా పెద్ద ఎత్తున సబ్సిడీ రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. నాబార్డు సీజీఎం ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సంఘాలకు అతి తక్కువ వడ్డీకి నాబార్డు రీ ఫైనాన్స్ ద్వారా రుణాలు ఇచ్చే కార్యక్రమాన్ని వివరించారు. అదేవిదంగా సీజీటీఎంఎస్ కింద రిజిస్టర్ అయినతో ఐదు కోట్ల వరకు ఎలాంటి కోలాటరల్ సెక్యురిటీ లేకుండా సబ్సిడీ లోన్స్ ఇచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మూడు వేలకు పైగా కొత్త గ్రూపులున్నాయని ఆ గ్రూపుల్లో కొన్ని గ్రూపులకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నుంచి రుణాలు ఇస్తే బ్యాంకు అభివృద్ధితో పాటు మహిళలు మరింత అభివృద్ధి చెందుతారన్నారు. ఆప్కాబ్ జీఎం అశ్విని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కోపరేటివ్ బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు అధికారులు, అగ్రికల్చర్ అధికారులు, బ్యాంకు సీఈవో శంకర్రావు, బ్యాంక్ జీఎం నర్మద పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరు కల్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.11,27,492 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.

శాస్త్రీయ పద్ధతిలో పారిశుధ్యం నిర్వహించాలి

యాదగిరిగుట్ట దివ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు నలుమూలల నుంచి తరలివస్తున్న భక్తుల సౌకర్యార్థం శాస్త్రీయ పద్ధతుల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆలయ ఈవో వెంకట్రావు అధికారులను ఆదేశించారు. కొండపై దేవస్థాన ప్రధాన కార్యాలయంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించిన ఈవో మాట్లాడారు. చెత్తాచెదారంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య విభాగం అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఇందుకు గాను నిబంధనల మేరకు నాణ్యమైన వస్తువులు సరఫరా చేసే అంశంపై అధికారులతో చర్చించారు. సిబ్బంది పనితీరుపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య విభాగంలో పనిచేసే సిబ్బంది విధిగా హాజరు, వర్క్‌చార్ట్, డ్రెస్ కోడ్ నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. చెత్త నిర్మూలనకు లోపాలు లేకుండా విధులు నిర్వహించాలన్నారు.సమావేశంలో డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో ప్రతాప నవీన్ కుమార్‌శర్మ, సివిల్, ఎలక్ట్రికల్ విభాగాల ఈఈలు జిల్లెల దయాకర్‌రెడ్డి, ఊడెపు రామరావు, పర్యవేక్షకుడు దాసోజు నరేష్, ఎస్పీఎఫ్ ఇన్స్‌పెక్టర్ కే. శేషగిరిరావు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

చిట్యాల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): చిట్యాల గ్రంథాలయానికి చిట్యాలకు చెందిన ప్రవాస భారతీయుడు సంగిశెట్టి రవికుమార్ పుస్తకాలను బహూకరించారు. వ్యక్తిత్వ వికాస పుస్తకాలతో పాటు మరికొన్ని పుస్తకాలను రవికుమార్ తల్లి సంగిశెట్టి వజ్రమ్మ ద్వారా బుధవారం గ్రంథపాలకుడు సంధినేని అనిల్‌కుమార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో పదో వార్డు మాజీ కౌన్సిలర్ సిలివేరు మౌనికశేఖర్, సిలివేరు లింగస్వామి, గంజి కృష్ణయ్య, తడక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం రేపు

రామగిరి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ స్వర్ణకార సంఘం ఈ నెల 12వ తేదీన నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమం పట్టణంలోని విశ్వబ్రాహ్మణ వసతిగృహంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు చొల్లేటి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నట్లు తెలిపారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

శాలిగౌరారం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామపాలన అధికారులు బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ షేక్ జమీరుద్దీన్ అన్నారు. విధి నిర్వహణలో బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని, గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ బిట్ల వరప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐలు అజారుద్దీన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామం	అధికారి పేరు
మాదారం -	టేకుల యాదగిరి,
ఇటుకులపహాడ్,	
వంగమర్తి-	గండమళ్ల శ్రీరాములు
వల్లాల -	టంగుటూరి కృష్ణయ్య
అడ్లూర్ -	దండి లక్ష్మీనారాయణ
శాలిగౌరారం,	
శాలిలింగోటం -	పిల్లి యాదయ్య,
గురజాల,	
తుడిమిడి -	ఎలిజాల శ్రవణ్ కుమార్
ఊట్కూరు -	రుద్రాక్షి శ్రీలత
భైరవునిబండ, తక్కళ్లపహాడ్,	
వడ్డీపాముల -	ఐనాల బిక్షయ్య
పెర్కకొండారం -	షేక్ జానీమియా
చిత్తలూరు -	ఓర్సు రజిత
మనిమద్దె, నూలగడ్డ కొత్తపల్లి,	
ఉప్పలంచ,	
రామాంజపురం -	యాదయ్య,
ఆకారం -	టేకుల సందీప్

ఆఖరి మజిలీకి అవస్థలు

- అసౌకర్యాల నడుమ వైకుంఠధామాలు
- నీరు, విద్యుత్ సౌకర్యం లేక నిరుపయోగం
- పట్టించుకోని అధికారులు



విద్యుత్, నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న శాలిగౌరారంలోని వైకుంఠధామం, పిచ్చిమొక్కల మధ్య స్నానాల గదులు

శాలిగౌరారం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆఖరి మజిలీలోనూ అవస్థలు తప్పడం లేదు. పేదల కోసం భూములు లేని నిరుపేదల కోసం మృతదేహాలను దహనం చేయడానికి ప్రతీ గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షలు వెచ్చించి వైకుంఠధామాలను నిర్మించారు. ప్రస్తుతం వాటి నిర్వహణ పరిస్థితి మాత్రం అస్తవ్యస్తంగా మారింది. శాలిగౌరారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో వైకుంఠధామాలను నిర్మించారు. అందులో కొన్ని ఊరికి దూరంగా, కొన్ని గ్రామంలో మౌలిక వసతులు లేక నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని నాసిరకంగా నిర్మించడం వల్ల అప్పుడే శిథిలావస్థకు చేరాయి. శాలిగౌరారంలోని వైకుంఠధామం మూడు కిలోమీటర్ల దూరంలో గండికుంట వద్ద నిర్మించారు. ఈ వైకుంఠధామంలో విద్యుత్, నీటి సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. స్నానాల గదులు కూడా సౌకర్యంగా ఉన్నాయి. భూములు లేని నిరుపేదలు కొందరు వినియోగించుకుంటున్నా అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చిమొక్కలతో పాటు కంపచెట్లు మొలిచి అధ్వానంగా ఉన్నాయి. ఆకారం, భైరవునిబండ, చిత్తలూరు, వంగమర్తి గ్రామాల్లోని వైకుంఠధామాల షెడ్ల రేకులు లేచిపోయాయి. ఇక్కడ కూడా విద్యుత్, నీటి సౌకర్యం లేదు. పెర్కకొండారం గ్రామంలో మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ వైకుంఠధామానికి బాట లేనందున ఎవ్వరు కూడా అక్కడ దహన సంస్కారాలు చేయడానికి వెళ్లడం లేరు. కొన్ని గ్రామాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నా వైకుంఠధామాల్లో కాకుండా వారి యొక్క భూముల్లోనే దహన సంస్కారాలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వైకుంఠధామాలను పర్యవేక్షించి అన్ని సౌకర్యాలు కలిపించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైకుంఠధామాల్లో సౌకర్యాలు కల్పించాలి



శాలిగౌరారంలోని వైకుంఠధామంలో ముఖ్యంగా విద్యుత్, నీటి సౌకర్యం లేదు. పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. అసౌకర్యంగా ఉంది. ఊరికి దూరంగా ఉన్నా తప్పని సరి పరిస్థితిలో దహన సంస్కారాలు చేస్తున్నారు. నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. సంబంధిత అధికారులు వైకుంఠధామాలపై శ్రద్ధ పెట్టి అన్ని సౌకర్యాలు కల్పించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలి.

\- నిమ్మల సురేష్, శాలిగౌరారం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



శాలిగౌరారంలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీనివాసరావు

శాలిగౌరారం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జడ్పీ సీఈవో సీహెచ్.శ్రీనివాసరావు అన్నారు. శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి హామీకి సంబంధించి సోషల్ ఆడిట్ పేరాలు, రిపోర్టులను పరిశీలించారు. ఉపాధిహామీ పనులను పరిశీలించారు. డ్రైన్ ఎండ్ సోక్ పనులను పర్యవేక్షించారు. అనంతరం శాలిగౌరారం, వల్లాల గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లను పక్కాగా నిర్మించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కేజీబీవీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఉపాధి హామీ ఏపీవో జంగమ్మ, ఎంఈవో మందుల సైదులు, పీఆర్ఏఈ భరత్ చంద్ర, కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో నాగరాణి, వైద్యాధికారిణి శిల్ప, శాలిగౌరారం పంచాయితీ కార్యదర్శి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే నిర్వహించాలి



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న మండల ప్రత్యేక అధికారి హరీష్

కేతేపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జె.హరీష్‌కుమార్ అన్నారు. కేతేపల్లి మండలంలో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రం కేతేపల్లిలోని ఎస్సీ బాలుర హాస్టల్, పీహెచ్‌సీ, చెరుకుపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం తనిఖీ చేశారు. వసతి గృహం, కేజీబీవీల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వంటల నాణ్యతను పరిశీలించారు. పీహెచ్‌సీని తనిఖీ చేసి అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆ సుపత్రి వైద్యులతో సమీక్షించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మండలంలో వివిధ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత సీజన్‌లో యూరియా నెలకొన్న నేపథ్యంలో యూరియా అక్రమ నిల్వలు, అక్రమ అమ్మకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏవో పురుషోత్తానికి ఆయన సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఏవో పురుషోత్తం, ఎంపీవో నాగలక్ష్మి, ఏపీవో సురేందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్ష పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

శాలిగౌరారం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించిన పుస్తకాలు మాజీ సర్పంచ్ ఇంద్రకంటి ముత్తయ్య జ్ఞాపకార్థం కుమారుడు ఇంద్రకంటి శ్రీనివాస్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మందడి చంద్రారెడ్డి, జిల్లా విద్యా కమిటీ మాజీ డైరెక్టర్ సుల్తాన్ యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు నివాళి

కట్టంగూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరుకు చెందిన దివంగత మాజీ సర్పంచ్ ఎరకల జానయ్య సతీమణి ఎరకల దుర్గమ్మ ఇటీవల మృతి చెందారు. కాగా బుధవారం దుర్గమ్మ చిత్రపటానికి పూలమాల వేసి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎరకల రవికుమార్, ఎరకల శ్రీనివాస్, ఎరకల మల్లేష్, కృష్ణయ్య, ఎరకల రాములుతో పాటు తదితరులు ఉన్నారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



నల్లగొండలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): తెలంగాణ వీర నారి చాకలి ఐలమ్మ సాగించిన పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు అధికారులు, రాజకీయ, యువజన, ప్రజా సంఘాల, రజక సంఘం నాయకులు కోరారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా సాయుధ పోరాట వీరనారి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ పోరాటమంతా వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా, దున్నేవాడికి భూమి కావాలని నినాదంతో ముందుకు సాగిందన్నారు. సమస్యలు లేని రాష్ట్రం కోసం వీర నారి స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎన్డీఏ కూటమిలో ఉన్న పెద్దలు ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వ్యంగ్య ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాషం, చినపాక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● పంచతత్వ పార్క్ వద్ద చాకలి ఐలమ్మ వర్ధంతిని సీపీఎం నల్లగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున, మండల కార్యదర్శి నలుపరాజు సైదులు, కొండ అనురాధ, రవీందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

● వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పెద్దబండ సెంటర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాశం, జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, దండెంపల్లి సత్తయ్య, పద్మ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్, చిత్రం నరేష్, బాలరాజు, యాదగిరి పాల్గొన్నారు.

● చిట్యాలలో సీపీఎం నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, పామునగుల్ల అచ్చాలు, ఐతరాజు నర్సింహ, నకిరేకంటి రాములు పాల్గొన్నారు.

● కట్టంగూరులో రజక సంఘం నాయకులు చెరుకు యాదగిరి, రెడ్డిపల్లి వీరస్వామి, చెరుకు నాగరాజు, కాంద్రాని శంకర్, చెరుకు రామన్న, రెడ్డిపల్లి సైదులు, రవి, వెంకన్న, నర్సింహ ఉన్నారు.

● మర్రిగూడలో మాల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, మాజీ సర్పంచులు నీలిమ చంద్రశేఖర్, నల్ల యాదయ్య గౌడ్. పిట్టల శ్రీనివాస్, పందుల రాములు గౌడ్ ఉన్నారు.

● నార్కట్‌పల్లిలో సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, చెర్కు పెద్దులు, కొప్పు శ్రవణ్, దండు రవి, ఆమనగంటి ఐలయ్య పాల్గొన్నారు.

● కేతేపల్లిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు వి.సౌడయ్య, ఎ.నాగయ్య, సంతోష్, జె.పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడులో సీపీఎం మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, వరికుప్పల ముత్యాలు, రజక సంఘం, వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు భూతరాజు సత్తయ్య, రేవెల్లి సైదులు, అంజయ్య, శ్రీరాములు, సైదులు పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో రజక సంఘం అధ్యక్షుడు బాసాని వెంకన్న, ఉపాధ్యక్షుడు తాందారి సోములు, కార్యదర్శి తాందారి నాగయ్య పాల్గొన్నారు.



చిట్యాలలో నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



కనగల్ హైస్కూల్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

కనగల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని తహసీల్దార్ పద్మ కోరారు. కనగల్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు నిర్వహించిన మండలస్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. గ్రామీణ విద్యార్థుల్లో ప్రతిభకు కొదవలేదన్నారు. ఇదిలాఉంటే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో మొత్తం 350మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ కనబర్చిన 180 మంది విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారని ఎంఈవో పద్మ, గవర్నమెంట్ ఆర్గనైజర్ కుంభం నర్సిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుమలత, ఎస్ఐ రాజీవ్‌రెడ్డి, హెచ్ఎం సృజనాకుమారి, ప్రిన్సిపాల్ థామస్, కరస్పాండెంట్ నక్క రమేష్. పీడీలు వి.రాజు, సుదాకర్, విజయ్, సంపత్, శేఖర్, నాగులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కట్టంగూరులో మాట్లాడుతున్న శ్రీదేవి

కట్టంగూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శారదారాణి, పద్మావతి అన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం మహిళా శిశు సంక్షేమశాఖ, సఖీ సెంటర్ ఆధ్వర్యంలో బాలికలకు ఆరోగ్యం, విద్య ప్రాముఖ్యత పై నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలని సూచించారు. సెల్‌ఫోన్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, అక్రమ రవాణా, బేటీ బచావో బేటీ పడావో, లింగబేధం, బాల్య వివాహాలు, ఆరోగ్యం, పరిశుభ్రత సోషల్ మీడియాతో కలిగే చెడు ప్రభావాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఆపదకాలంలో హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 100, 181 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ ఎస్‌వో నీలాంబరి, సఖి సెంటర్ కౌన్సిలర్ నాగమణి, టీహబ్ కౌన్సిలర్ శ్రీదేవి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం



కట్టంగూరులో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కట్టంగూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మోహన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎస్.పాండరి, దొంత శ్రీనివాసరావు, పోగుల సంపత్‌కుమార్, అంతటి ఆదిలక్ష్మి, కంది స్వప్న, పి.రమాదేవి, కె.అనిలాకుమారిలను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. అదేవిధంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేసి విద్యార్థుల సంఖ్యను పెంచిన మల్లారం, ఈదులూరు, మునుకుంట్ల, గార్లబాయిగూడెం, తేలువారిగూడెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలను, ఉపాధ్యాయులను, ఎంఎస్ కోఆర్డినేటర్ కొప్పు గోవర్ధన్‌ను శాలువా కప్పి ఆమె ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఎంఈవో అంబటి అంజయ్య, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు వెంకటరమణ, రాములు, సీఆర్‌పీలు పోలగోని రవికుమార్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

కట్టంగూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితాను బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు విడుదల చేశారు. మండలంలో మొత్తం 63 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పురుష ఓటర్లు 18565, మహిళా ఓటర్లు 18797, మొత్తం 37362 ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో స్వరూపారాణి, సూపరింటెండెంట్ చింతమల్ల చలపతి, మద్ది సులోచన, శివశంకర్, వాణి ఉన్నారు.

ఓటర్లు 10.73 లక్షలు

(5వ పేజీ తరువాయి)

ప్రక్రియ మొదలవుతుంది. జీవో వచ్చిన వారం రోజుల్లో ఈ రెండు ప్రక్రియలు ముగుస్తాయి. అందుకోసం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీఆర్‌వోలు, ఆర్డీవోలు ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల కోసం సన్నద్ధంగా ఉన్నారు. రిజర్వేషన్లను ప్రకటించిన తక్షణమే ఎన్నికల ప్రచారంలోకి దిగేందుకు రాజకీయ నాయకులు ఇప్పటికే సన్నహాలు చేసుకుంటుండగా, ఎవరికి అవకాశం దక్కుతుందనే ఉత్కంఠ అందరిలో ఉంది.

జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు, ఓటర్లు ఇలా..

జడ్పీటీసీ స్థానం	ఎంపీటీసీ	పోలింగ్ స్టేషన్లు	మొత్తం ఓటర్ల సంఖ్య
అడవిదేవులపల్లి	5	26	14,674
అనుముల	8	45	23796
చందంపేట	9	64	30679
చండూరు	8	43	24323
చింతపల్లి	14	85	45054
చిట్యాల	12	60	35716
దామరచర్ల	14	78	40914
దేవరకొండ	11	65	35716
గట్టుప్పల్	5	27	15617
గుడిపల్లి	5	24	12271
గుండ్లపల్లి	13	78	41525
గుర్రంపోడు	12	74	38571
కనగల్	12	67	36892
కట్టంగూరు	13	63	37362
కేతేపల్లి	11	55	31084
కొండమల్లేపల్లి	9	53	29599
మాడుగులపల్లి	10	56	30523
మర్రిగూడ	10	51	30785
మిర్యాలగూడ	19	99	55180
మునుగోడు	13	69	38038
నకిరేకల్	9	47	26843
నల్లగొండ	13	67	39229
నాంపల్లి	11	68	36411
నార్కట్‌పల్లి	15	83	43772
నేరేడుగొమ్ము	6	45	20262
నిడమనూరు	13	65	36094
పీఏపల్లి	10	51	27644
పెద్దవూర	11	62	34494
శాలిగౌరారం	13	70	40388
తిప్పర్తి	9	48	27690
తిరుమలగిరిసాగర్	11	64	35075
త్రిపురారం	12	66	36698
వేములపల్లి	7	38	20568
మొత్తం	353	1956	1073506

పల్లెవెలుగు బస్సుల సంఖ్య పెంచాలి



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, మద్దతు తెలుపుతున్న గ్రామస్థులు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్లె వెలుగు బస్సులను సంఖ్య పెంచాలని, కళాశాలల సమయానికి అనుకూలంగా నడపాలని పలువురు విద్యార్థులు డిమాండ్ చేశారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద బుధవారం కళాశాల విద్యార్థులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామానికి రావాల్సిన బస్సులు సకాలంలో రాకపోవడం, ఆర్టీసీ పల్లె వెలుగు బస్సుల సంఖ్యను కుదిండంతో తాము కళాశాలలకు వెళ్లి చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్లే పల్లెవెలుగు బస్సులను తగ్గించడంతో కళాశాలకు వెళ్లలేకపోతున్నామని అన్నారు. 11గంటల తర్వాత రావడంతో కళాశాలకు వెళితే అధ్యాపకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షలకు హాజరుకాలేకపోతున్నామని వాపోయారు. ఆటోల్లో వెళదామంటే అవి నిండుగా ఉంటున్నాయన్నారు. పెద్దకాపర్తి, వెలిమినేడు, గుండ్రాంపల్లికి చెందిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, తాము ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని బస్సుల సంఖ్యను పెంచాలని సకాలంలో నడపాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

పరిమితికి మించి వైద్యం చేయొద్దు

మర్రిగూడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో వైద్య చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు ఎటువంటి అర్హత లేకుండా పరిమితి మించి వైద్యం చేస్తున్నారని వారిపై చర్యలు తప్పవని మర్రిగూడ మండల ప్రభుత్వ ఆరోగ్య వైద్యాధికారిని డాక్టర్ షాలిని అన్నారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలో ఉన్నటువంటి ఫస్ట్ ఏయిడ్ సెంటర్‌ను తనిఖీ చేశారు.

సేవా స్ఫూర్తి పౌండేషన్ దాతృత్వం

మర్రిగూడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని సేవా దృక్పథంతో ముందుకు వచ్చి ఉచితంగా సైకిల్స్ పంపిణీ చేసి దాతృత్వాని చాటుకున్న సేవా స్ఫూర్తి పౌండేషన్ సంస్థను ఎంఈవో బిట్టు శ్రీనివాస్ అభినందించారు. బుధవారం మండలంలోని దామెర భీమన పల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సేవా స్ఫూర్తి పౌండేషన్ అధ్యక్షులు వంగూర్ విజయభాస్కర్ రెడ్డి, సంస్థ డైరెక్టర్ ఊరే షుగ్రీవారెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్, సహకారంతో, ప్రభుత్వ ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త గిరిజ మహేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా సైకిల్స్ పంపిణీ చేశారు.

మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ పన్ను నరేంద్ర మోదీ ప్రభుత్వం తగ్గించినందుకు బుధవారం మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షులు బొగరి అనిల్ కుమార్ అధ్వర్యంలో ప్రధాని మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రమోద్, నర్సింహ, రుక్మగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కెనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను శ్రీ వెంకటేశ్వర సేవా ట్రస్టు సభ్యులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్టు సౌజన్యంతో పాఠశాలలో రూ.50,000లతో నిర్మించిన వేదికను ట్రస్టు చైర్మన్ సోమనాథ శాస్త్రి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.వెంకటేశం, రిటైర్డ్ లెక్చరర్, హెచ్ఎంలు సీతారాంరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బీ.వెల్లెంలలో గుండెపోటుతో వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంలకు చెందిన దామెర సైదులు (42) బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందాడు. తన స్వగ్రామానికి చెందిన సైదులు చనిపోయిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బత్తుల ఊశయ్య ద్వారా తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెంటనే స్పందించాడు. కుటుంబ అవసరాల కోసం తక్షణ సాయంగా రూ.లక్షను పంపించగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

నల్లగొండలో భారీ వర్షం

రామగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి సాయింత్రం మధ్యహ్నా వరకు మిరుగులు దునికే ఎండ.... ఉన్నట్టుండి సాయంత్రం సమయంలో భారీ వర్షంతో నల్లగొండ పట్టణంలో తడిసి ముద్దయింది. ప్రధాన రహదారులన్నీ జలమయాయ్యి. రహదారులపై ఉన్న యుజీడి మ్యాన్‌హోల్స్‌పై ఉన్న మూతలు సైతం కొట్టుకపోయేంత వరద ప్రవహించింది. ప్రధానంగా డీఈవో కార్యలయం ముందు రోడ్ జలమయంగా మారడంతో చిన్నపాటి చెరువులుగా తలపించాయి.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 31.5
కనిష్ఠం 23.4
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 11 సెప్టెంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.10 (309.3558)	70,769	70,769
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,424.06	1,711.69
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.423 (43.3532)	45,230	45,985

చికెన్ ధరలు	లైవ్ : రూ.144	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.240

పాడిరైతుల సంక్షేమమే ధ్యేయం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- విజయ డెయిరీని బలోపేతం చేస్తాం
- ఫెడరేషన్ విస్తరణకు ప్రణాళిక
- త్వరలో కొత్త సొసైటీలు
- ఏడాదిలో నష్టాల దశ నుంచి లాభాల్లోకి తీసుకువచ్చాం
- డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి

పాడి రైతుల సంక్షేమం, విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం, జిల్లాల్లో కుంటుపడిన డెయిరీలను పునరుద్ధరించి లాభాల్లోకి తేవడమే మా ముందున్న కర్తవ్యం.. ప్రభుత్వ మద్దతు, పాడిరైతుల సహకారం, అధికారులు, ఉద్యోగుల అంకితభావంతో విజయ డెయిరీని ప్రగతిపథంలోకి తీసుకువస్తాం.. అని తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఫెడరేషన్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మాట్లాడుతూ విజయ డెయిరీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

● నేను బాధ్యతలు తీసుకునే నాటికి ఫెడరేషన్ గడ్డు పరిస్థితుల్లో ఉంది. రూ.200కోట్ల అప్పులు పేరుకుపోగా, మూడునెలల పాలబిల్లులు సైతం రైతులకు ఇవ్వలేని పరిస్థితి ఉంది. ప్రతి రోజూ 4లక్షల లీటర్ల పాలు సేకరిస్తే, అందులో 1.50లక్షల లీటర్ల పాలు మిగిలిపోయేవి. దీంతో వీటిని ప్రాసెసింగ్ చేయడం కోసం ప్రతి రోజూ చిత్తూరు పంపేవాళ్లు. అక్కడ పౌడర్‌గా, వెన్నగా మార్చి మళ్లీ ఇక్కడికి తెచ్చి విక్రయించేవారు. దీంతో లీటర్‌కు రూ.8చొప్పున అదనపు ఖర్చు వచ్చేది. ప్రతి రోజూ కనీసం రూ.12లక్షల అదనపు వ్యయం అయ్యేది. అంతేగాక ఏడాదిలో 1600 మెట్రిక్‌టన్నుల పౌడర్, 1400 క్వింటాళ్ల నెయ్యి వృథాగా పోయింది. ఈ విధంగా నెలకు రూ.15కోట్ల వరకు నష్టాలు వచ్చేవి. నేను బాధ్యతలు తీసుకునే ముందు మూడేళ్లపాటు ఇదే పరిస్థితి కొనసాగింది. అందుకే రూ.200కోట్ల పైచిలుకు నికరనష్టం వచ్చింది. చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నాక పరిస్థితిని సమీక్షించి ముఖ్యమంత్రికి, మంత్రులకు వివరించగా, వారు డెయిరీ పునరుద్ధరణకు మద్దతుగా నిలిచారు. రూ.100కోట్ల గ్రాంట్ ఇవ్వగా, ఆ నిధులతో డెయిరీలో సంస్కరణలు చేపట్టి మరో రూ.50 కోట్లు జమచేసి రైతుల బకాయిలు చెల్లించాం.


సంస్కరణలతో నష్టాల పూడ్చివేత

విజయ డెయిరీని లాభాల్లోకి తీసుకు వచ్చేందుకు సంస్కరణలు అమలు చేస్తున్నాం. ఖర్చులు తగ్గించాం. పాలసేకరణకు అయ్యే ఖర్చులు, విద్యుత్, రవాణా తదితర ఖర్చులను తగ్గించాం. పాలసేకరణే కాకుండా పాల విక్రయాలను పెంచాం. దీంతో ప్రాసెసింగ్ ఖర్చులు తగ్గించాం. 4లక్షల లీటర్ల పాలు సేకరిస్తే, అందులో 2.50లక్షల పాలను నేరుగా విక్రయిస్తున్నాం. మిగిలిన పాలను చిత్తూరుకు పంపకుండా ఇక్కడే సీఎం, మంత్రుల సూచనలతో రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థలకు, హాస్టళ్లకు విజయ డెయిరీ పాలనే సరఫరా చేస్తున్నాం. అదేవిధంగా అంగన్‌వాడీలకు మరో 50వేల లీటర్లను టెట్రాప్యాకెట్ల ద్వారా అందజేస్తున్నాం. రాష్ట్రంలోని దేవాలయాలన్నింటికీ విజయ డెయిరీ నెయ్యినే అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా ప్రతి రోజూ 50 మెట్రిక్‌టన్నుల నెయ్యి సరఫరా చేస్తున్నాం. దీంతో భారీగా ఖర్చు తగ్గడమేగాక లాభాల దశకు చేరాం.

డెయిరీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ

రాష్ట్రంలో 1500 వరకు నేరుగా ఫెడరేషన్ కింద పనిచేసే సొసైటీలు ఉన్నాయి. వీటిని విస్తరించాలని నిర్ణయించాం. ప్రస్తుతం సొసైటీలు లేని చోట్ల, పాలసేకరణ అవకాశాలు ఉన్నచోట్ల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నాం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ, మిగతా 6వ పేజీలో...

అమ్మో పెద్ద ప్లానింగే!



- అవినీతికి అడ్డాగా టౌన్‌ప్లానింగ్ విభాగం
- మామూళ్లు అందనిదే కదలని ఫైళ్లు
- కిందిస్థాయి సిబ్బందితో వసూళ్లు
- అధికారుల కొరత, ఉన్న వారి నిర్లక్ష్యంతో అక్రమ కట్టడాలు

ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లో టౌన్‌ప్లానింగ్ అధికారులు అంతస్తుకో రేటు నిర్ణయించి, చేయి తడిపితే చాలు నో అబ్జక్షన్ అనేస్తున్నారు. దీంతో సెట్ బ్యాక్ అనేది లేకుండా నిర్మాణాలు వెలుస్తున్నాయి. విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు సాగుతున్నా పట్టించుకునే వారు లేరు. దీనికి తోడు సర్వేయర్లతో పాటు క్షేత్రస్థాయి సిబ్బందితో మామూళ్లు వసూలు చేయిస్తున్నారు. ఏసీబీకి చిక్కకుండా జాగ్రత్తలు పడేందుకు వారితో మామూళ్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. 6



పరిషత్ ఓటర్లు 10.73లక్షలు

- 1,956 పోలింగ్ కేంద్రాలు ఖరారు
- తుదిజాబితా ప్రచురణ
- ఇక రిజర్వేషన్లే తరువాయి

నల్లగొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పరిషత్ ఎన్నికల ఓటర్ల తుదిజాబితా ఖరారైంది. బుధవారం సాయంత్రం వరకు ఎలాంటి అభ్యంతరాలు, సవరణలు రాకపోవడంతో ముసాయిదా జాబితాలో పేర్కొన్న ప్రకారమే జిల్లాలో 33 జడ్పీటీసీ స్థానాలు, 33 ఎంపీపీ స్థానాలతో పాటు, 353 ఎంపీటీసీ స్థానాల పరిధిలో 1,956 పోలింగ్ కేంద్రాలను ఖరారు చేశారు. మొత్తం 10,73,506 మంది ఓటర్లను నిర్ధారించారు. ఈ మేరకు తుదిజాబితాను జిల్లా సహాయ ఎన్నికల అధికారి, జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు బుధవారం అధికారికంగా ప్రకటించారు.

జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

జిల్లాలో తుది జాబితా ప్రకారం 33 జడ్పీటీసీ స్థానాలు, 353 ఎంపీటీసీ స్థానాల్లో మొత్తం 10,73,506 మంది ఓటర్లు ఉండగా, అందులో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 5,42,589 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 5,30,860 మంది పురుష ఓటర్లు, 57మంది థర్డ్‌జండర్ ఓటర్లు ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా 55,180 ఓటర్లతో మిర్యాలగూడ మండలం తొలి స్థానంలో నిలవగా, 12,271 ఓట్లతో గుడిపల్లి తక్కువ ఓట్లున్న మండలంగా నిలిచింది.

26 మండలాల్లో మహిళా ఓటర్లే అధికం

జిల్లాలోని 33 మండలాలకు 26 మండలాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. అనుముల, చండూరు, చింతపల్లి, చిట్యాల, దామరచర్ల, గుడిపల్లి, డిండి, గుర్రంపోడు, కనగల్, కట్టంగూరు, కేతేపల్లి, మాడుగులపల్లి, మర్రిగూడ, మిర్యాలగూడ, మునుగోడు, నకిరేకల్, నల్లగొండ, నాంపల్లి, నార్కట్‌పల్లి, నిడమనూరు, పెద్దవూర, తిప్పర్తి, శాలిగౌరారం, తిరుమలగిరిసాగర్, త్రిపురారం, వేములపల్లి మండలాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. దీంతో ఈ జడ్పీటీసీ స్థానాలను మహిళలకు కేటాయిస్తారనే చర్చ సాగుతోంది.

రిజర్వేషన్లు రాగానే ఎన్నికలకు సన్నద్ధం

పంచాయతీ రాజ్ ఎన్నికల్లో ఇటు గ్రామ పంచాయతీలకు వార్డుల వారీగా, అటు పరిషత్‌లకు ఎంపీటీసీ, పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాల తుది ప్రచురణ పూర్తయింది. దీంతో ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ప్రాథమిక దశ ముగిసింది. ఇక ప్రభుత్వం రిజర్వేషన్ల కోటా జీవో ఇస్తే రిజర్వేషన్ల ఖరారు, కేటాయింపుల మిగతా 8వ పేజీలో...



ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను గడువులోగా పూర్తిచేయాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాన్ని నిర్ణీత తొమ్మిది నెలల గడువులోగా పూర్తిచేయాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను ఆయన తనిఖీచేసి పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 25 ఎకరాల్లో అధునాతన హంగులతో, ప్రపంచస్థాయి ప్రమాణాలతో స్కూల్‌ను నిర్మిస్తున్నామని అన్నారు. అందులో 1.10లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్స్ నాలుగు బ్లాకులుగా నిర్మిస్తున్నామన్నారు. దీంతో పాటు స్టాఫ్ క్వార్టర్స్, డైనింగ్ హాల్, ఇతర నిర్మాణ పనులు సమాంతరంగా జరిగేలా వేగంగా నిర్వహించాలన్నారు. ఒకటో బ్లాక్ మొదటి స్లాబ్ అక్టోబరులోగా పూర్తవ్వాలన్నారు. రాష్ట్రంలో నల్లగొండ స్కూల్ నిర్మాణం ఆదర్శంగా ఉండాలని, అందుకు అనుగుణంగా అధికారులు, వర్క్ ఏజెన్సీ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మంత్రి వెంట పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి

చదవడం, రాయడం నేర్పించాలి

విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ధారాళంగా మాట్లాడటంతోపాటు చదవగలిగే నైపుణ్యాలను నేర్పించాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీచేశారు. పాఠశాలలో జరుగుతున్న ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల తీరును పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ ప్రాముఖ్యాన్ని ఉపాధ్యాయులకు వివరించారు. పదో తరగతిలో గత ఏడాదికంటే మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. డీఈవో భిక్షపతి మాట్లాడుతూ, మండలంలో పాఠశాల విద్యార్థి పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. వారి వెంట ఎంఎన్‌వో వెంకటేశం, హెచ్ఎం హిమజ, కాంప్లెక్స్ హెచ్ఎం డి.రాములు, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఎంజీయూలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా తిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎంజీ యూనివర్సిటీకి ఈనెల 15న గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ రానున్నందున అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయాన్ని ఆమె సందర్శించి స్నాతకోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గవర్నర్ రాక సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి బాధ్యతల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. 15న ఎలాంటి విద్యుత్ అంతరా యం కలగకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. మెడికల్, 108, 104, ప్రత్యేక వైద్యుల బృందాన్ని అందుబాటులో ఉంచాలని, వేదిక ఏర్పాట్లను పూర్తిచేయాలన్నారు. తాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, యూనివర్సిటీలో పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాటుచేస్తామని, తనిఖీలు ఉంటాయని, గుర్తిం పుకార్డు ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతిస్తామన్నారు. గేటు వద్ద తనిఖీ కోసం యూనివర్సిటీ తరపున నలుగురు బృందం సభ్యులు ఏర్పాటు చేయాలని వీసీని కోరారు. గవర్నర్ కార్యక్రమానికి హాజరయ్యే అందరి పేర్ల జాబితాను ముందే సమర్పించాలని కోరారు. అంతకు ముందు వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ, యూనివర్సిటీ స్నాతకోత్సవంలో భాగంగా 15న ఉదయమే గవర్నర్ ప్రత్యేక సమావేశం ఉంటుందని, ఉదయం 11గంటలకు ఆయన వస్తారని తెలిపారు. 22 మంది పీహెచ్‌డీ విద్యార్థులు, 57 మంది బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు వాటిని ప్రదానం చేసిన అనంతరం గవర్నర్ ప్రసంగం ఉంటుందని తెలిపారు. 1గంటకు గవర్నర్ తిరిగి వెళ్తారని, ఏర్పాట్ల కోసం యూనివర్సిటీలో 12 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ మాత్యనాయక్, డీఈ నదీంఅహ్మద్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, పాల్గొన్నారు.

13న కుక్కలను దత్తత తీసుకునే కార్యక్రమం

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): వీధి, పెంపుడు కుక్కలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 13న జిల్లా కేంద్రంలోని రామగిరి మునిసిపల్ పార్కులో కుక్కల దత్తత, వాక్సినేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అదనపు కలెక్టర్లు నారాయణ్ అమిత్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రమేష్ బుధవారం జిల్లా కేంద్రంలోని రామగిరి మునిసిపల్ పార్కులో ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో కుక్కల దత్తత, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. దేవరకొండ మునిసిపాలిటీలో కార్యక్రమం విజయవంతం కావడంతో నల్లగొండ మునిసిపాలిటీలో జంతు ప్రేమికులు కుక్కలను దత్తత తీసుకునేలా ప్రోత్సహించేందుకు 13న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఇప్పటికే 30మంది కుక్కలను దత్తత తీసుకునేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

(ఆంధ్రజ్యోతి, చిట్యాలరూరల్): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో హెటిరో ఫార్మా కంపెనీ అనుబంధ సంస్థ దశమి ల్యాబ్స్ ఫార్మా కంపెనీలో నిర్వహించిన వనమహోత్సవంలో కలెక్టర్ మొక్క నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో యారాల అశోక్‌రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఇన్‌స్పెక్టర్ జానయ్య, జిల్లా పరిశ్రమల మేనేజర్ సతీష్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకన్న, తహసీల్దార్ జి.కృష్ణ, ఎంపీడీవో ఎస్‌పి.జయలక్ష్మి, దశమి ప్రతినిధులు, ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కేతేపల్లి, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ సూచించారు. బుధవారం కేతేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఆస్పత్రి ఏఎన్‌సీ, హైరిస్క్ కేసుల రిజిస్టర్లు, బాలింతలు, చిన్నారులకు వేసే వ్యాక్సిన్ నిల్వలు, కుక్క, పాము కాటు వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు. ల్యాబ్‌లో వివిధ పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్యాధికారులు క్షేత్రస్థాయి వైద్య సిబ్బందికి తగిన సూచనలు చేస్తూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు అర్చన కొండ్ర, ఎం.దివ్య, సిబ్బంది రవీందర్, యాదయ్య, నిర్మల, తదితరులు ఉన్నారు.

పనివేళల్లో కార్యాలయానికి తాళం వేస్తారా?

- ఎల్లారెడ్డిగూడెం జీపీ కార్యదర్శిపై డీపీవో ఆగ్రహం
- కారోబార్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు



పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో వెంకయ్య

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పనివేళల్లో గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేస్తారా? డ్యూటీ అంటే ఇంత నిర్లక్ష్యమా? అంటూ పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిపై జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వస్తానని చెప్పినా, కార్యాలయంలో ఏ ఒక్క సిబ్బంది ఉండకపోగా తాళాలు వేసి వెళ్లిపోతారా? అంటూ అసహనం ప్రదర్శించారు. విధుల్లో అలసత్వం వహించారనే కారణంతో కారోబార్‌ను సస్పెండ్ చేస్తూ అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య బుధవారం మధ్యాహ్నం వచ్చారు. అప్పటికే కార్యాలయానికి తాళాలు వేసి సిబ్బంది వెళ్లారు. దీంతో డీపీవో తన సిబ్బంది ద్వారా పంచాయతీ కార్యదర్శి చిరుమర్తి వెంకన్నకు ఫోన్ చేయించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎంపీడీవో సమావేశం ఏర్పాటు చేస్తే నార్కట్‌పల్లి వెళ్లానని చెప్పిన కార్యదర్శి కొద్దిసేపటికే అక్కడికి చేరుకున్నారు. కారోబార్ శేఖర్ వద్ద కార్యాలయ తాళాలు ఉండగా అతడిని పిలిచి కార్యాలయం తెరిపించి మందలించారు. అనంతరం రికార్డులు, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి కారోబార్‌ను సస్పెండ్ చేస్తూ నోట్ చేశారు. అనంతరం టెండర్ ద్వారా పంచాయతీకి చేరిన బ్లీచింగ్ పౌడర్ నిల్వ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయంలో కొందరు ఎంపీడబ్ల్యూఎస్ సిబ్బంది రాజకీయాలు చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని డీపీవో వెంకయ్య ఆదేశించారు.

ఐలమ్మ ఉద్యమం భావితరాలకు స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సత్యం

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ ఉద్యమం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రజక భవనం వద్ద రజక సంక్షేమ భవన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతిలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఐలమ్మ ముందుభాగాన నిలిచి పోరాడిందన్నారు. ఆమె పోరాటం తెలంగాణ రాష్ట్ర సాధన తొలిదశ, మలిదశ ఉద్యమాలకు ఊపునిచ్చిందన్నారు. ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ కలసాకారం అయిన అనతి కాలంలోనే ఐలమ్మను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఆమె రుణం తీర్చుకునే ప్రయత్నాలు, చర్యలు చేపట్టిందన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణను బంగారు తెలంగాణగా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆమంచి అంజయ్య, మిర్యాల యాదగిరి, దుడుకు లక్ష్మీనారాయణ, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, నాగిళ్ల మురళి, పిల్లి రామరాజు, పంకజ్ యాదవ్, కరీం పాషా, అయితగోని యాదయ్య, పగిళ్ల సైదులు, భీమనపల్లి నగేష్, చిలకరాజు చెన్నయ్య, చిక్కుల రాములు, దూదిగామ సత్తయ్య, లకడాపురం వెంకన్న, చిలుకరాజు సతీష్, రెడ్డిపల్లి సాగర్, చింతల వెంకన్న, దామునూరి శ్రీనివాస్, జంజిరాల శేఖర్, ఎలిజాల సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

చింతపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల, వీటీనగర్, పోలేపల్లిరాంనగర్, కుర్మేడ్, వింజమూర్ తదితర గ్రామాల్లో ముసురుతో కూడిన వర్షం బుధవారం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. అంతేకాక పత్తి రైతులకు ఊరట కలిగింది. పత్తి మొక్కలు పెరిగినా వర్షాలు సకాలంలో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ముసురుతో కూడిన వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు దేవరకొండలో ఎమ్మెల్యే జనహిత మార్నింగ్ వాక్

దేవరకొండ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీలో ఈ నెల 11వ తేదీన ఎమ్మెల్యే బాలునాయక్ జనహిత మార్నింగ్‌వాక్ విత్ పీపుల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ వార్డు, 5వ వార్డు, 18 వార్డుల్లో మార్నింగ్‌వాక్‌తో పాటు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అంతేకాక పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారని ఆయన పేర్కొన్నారు.

రాములునాయక్ మృతి

వైద్యరంగానికి తీరనిలోటు

- సంతాప సభలో ఎమ్మెల్యే బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు



రాములునాయక్ సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పేదల డాక్టర్‌గా పేరుగాంచిన దేవరకొండకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ రాములునాయక్ అనారోగ్యంతో మృతి చెందడం పేదలకు తీరనిలోటని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని సాయిశివ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బుధవారం నిర్వహించిన డాక్టర్ రాములునాయక్ సంతాప సభకు ఆయన హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, డీటీసీఎస్ డాక్టర్ మాతృనాయక్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రకాష్, డాక్టర్ వేణుధర్‌రెడ్డితో పాటు గిరిజన సంఘాల నాయకులు, డాక్టర్లు, పులువురు సంతాపం తెలిపి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా రాములునాయక్ 15 సంవత్సరాలకు పైగా పనిచేసి పేదలకు వైద్యసేవలు అందించారని అన్నారు. అంతేకాక దేవరకొండలో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేసి పేదలకు తక్కువ ఫీజుతో వైద్యాన్ని అందించారని, ఆయన మృతి వైద్యరంగానికే తీరనిలోటని అన్నారు. రాములునాయక్ ఆశయసాధన కోసం కృషి చేయాలని అన్నారు. ఈ సంతాప సభలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నాయకులు పల్లా నర్సింహారెడ్డి, బెజవాడ శేఖర్, డాక్టర్ కృష్ణ, డాక్టర్ మంగ్తానాయక్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన గిరిజనులు, డాక్టర్లు, రాములునాయక్ అభిమానులు పాల్గొన్నారు.

మునిసిపల్ మాజీ చైర్మన్ల ఇంట విషాదం

- అనారోగ్యంతో భార్గవ్ తల్లి మృతి



మల్లీశ్వరమ్మకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయసింహారెడ్డి, సిద్దార్థ

మిర్యాలగూడఅర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ మాజీ చైర్మన్ల ఇంట విషాదం నెలకొంది. పురపాలిక మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్ తల్లి, మాజీ చైర్‌పర్సన్ నాగలక్ష్మీభార్గవ్ అత్తగారైన తిరునగరు మల్లీశ్వరమ్మ (84) మృతి చెందారు. అనారోగ్యానికి గురై వారం రోజులుగా చికిత్స పొందుతున్న మల్లీశ్వరమ్మ బుధవారం ఉదయం మృతి చెందారు. మల్లీశ్వరమ్మది సుదీర్ఘ రాజకీయ నేపథ్యం గల కుటుంబం. భర్త తిరునగరు గంగాధర్, కుమారులు రమేష్, భార్గవ్‌లతో పాటు కోడలు నాగలక్ష్మి రాజకీయాల్లో ఉన్నత పదవులు నిర్వహించారు. కాగా మల్లీశ్వరమ్మ అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

● మాతృవియోగంలో ఉన్న మునిసిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్‌కు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు. భార్గవ్ తల్లి మల్లీశ్వరమ్మ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ, ప్రముఖ కాంట్రాక్టర్ వింజం శ్రీధర్, మునిసిపల్ మాజీ చైర్మన్ మెరుగు రోషయ్య, మాజీ వైస్ చైర్మన్ మగ్దూంపాషా తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రైస్ మిల్లర్స్, కమిషన్, కిరాణా, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు, ఆర్యవైశ్య, వైశ్య మహాసభ సంఘాలు మల్లీశ్వరమ్మ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు తిరునగరు మల్లీశ్వరమ్మ కంటి పాపలను నేత్రనిధి ప్రతినిధులు సేకరించారు. వాసవీ క్లబ్ ఆర్గాన్ డొనేషన్ విభాగ అంతర్జాతీయ చైర్మన్ మిట్టపల్లి విజయభాస్కర్ ఆధ్వర్యంలో నల్లగొండ ఐ బ్యాంక్ ద్వారా అగర్వాల్ హాస్పటల్‌కు తరలించారు.

నిర్మాణాల్లో పారదర్శకత పాటించాలి



మోహన్‌నాయక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు బాలునాయక్, సామేలు

దేవరకొండ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాలకు అనుగుణంగా రహదారులు, భవనాల నిర్మాణంలో పారదర్శకత, వేగం, నాణ్యత ప్రధానంగా ఉండాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) మోహన్‌నాయక్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే బాలునాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈఎన్‌సీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు బొకెను అందజేసి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలోని రహదారులకు నిధులు కేటాయించాలని కోరారు. ఆయన వెంట ఎమ్మెల్యే సామేలు, నాయకులు ఉన్నారు.

విద్యారంగంపై సవతితల్లి ప్రేమ సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి షోయబ్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం విద్యారంగం పై సవతితల్లి ప్రేమ చూపుతోందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ. షోయబ్ అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీ టూ పీజీ ఉచిత విద్యను అందించేందుకు మాజీ సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన విద్యాలయాలను నిర్లక్ష్యం చేస్తూ ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు కావాలంటూ కేంద్రప్రభుత్వాన్ని కోరడం సరికాదన్నారు. విద్యాభివృద్ధి, విద్యాలయాల విస్తరణ సరైనదేనని, అయితే ప్రస్తుతం విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించిన అనంతరం ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు హనుమానాయక్, సంపత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషిచేయాలి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని, ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లాలోని పలు మండలాల్లో ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దొరల గడీలను కూల్చిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఐలమ్మ చరిత్ర నేటి తరం మహిళలకు దిక్సూచి అని అన్నారు.

● దేవరకొండ సీపీఐ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ భూస్వాములు, పట్వారీల పెత్తనం, దౌర్జన్యాలను ఎదురించి పోరాడిన ధైర్యశాలి ఐలమ్మ అని గుర్తుచేశారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, ఫైనుద్దీన్, దేప సుదర్శన్‌రెడ్డి, రామస్వామి, ఆంజనేయులు, వెంకట్రాములు పాల్గొన్నారు.

● దేవరకొండలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, బెజవాడ శేఖర్ ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మిర్యాలగూడ: సీపీఎం కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కార్యక్రమంలో బీజేపీ నాయకులు వస్కుల సుధాకర్, వెంకటేష్, నర్సింహ, చండీశ్వర్, భాస్కర్ పాల్గొన్నారు.

● మిర్యాలగూడలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్, కర్నాటి శివరామకృష్ణ, గునగంటి వెంకన్న, నాగబూషణం తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి మండలకేంద్రంలో రజక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ఉట్కూరి వేమన్‌రెడ్డి, అర్వపల్లి సరితనర్సింహ, రమావత్ లాలునాయక్, జగన్, వెంకటేష్, అందుగుల లింగయ్య, భూతరాజు భరత్‌కుమార్, ఏరుకొండ రాము, వరికుప్పల శ్రీను, శ్రీను, సైదులు, సత్తయ్య, స్వామి, దాసు తదితరులు పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్‌లో హిల్‌కాలనీలో విజయవిహార్ వద్ద ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు విజయ, కృష్ణయ్య, జంగయ్య, వెంకన్న, శ్రీనివాస్, దుర్గయ్య, వేణు, రాము, రమేష్ పాల్గొన్నారు. మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు హిల్‌కాలనీలో దాని కళానిలయం వద్ద ఐలమ్మకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సుదర్శన్ స్మారక ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రాజు, కస్తూరి ప్రభాకర్, స్వతంత్ర్యబాబు, కిరణ్మయి, కొండల్‌రెడ్డి, నాగమణి, మున్నా, బాలేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

●హాలియాలో ఐలమ్మ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఏడారి నరేష్, మండల ప్రధాన కార్యదర్శి వట్టికోటి శ్రీను, నాయకులు జూపల్లి కృష్ణ, జూపల్లి కోటేష్, నల్లగొండ సుధాకర్, శ్రీనివాస్, రాంబాబు, కృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

ల్యాండ్రీ షాప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రెబెల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు అనుముల దుర్గయ్య, దుండిగల శ్రీను, నాయకులు అనిల్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● వేములపల్లి సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, నాయకులు రొండి శ్రీనివాస్, పాల్వాయి రాంరెడ్డి, కోడిరెక్క వెంకన్న, వడ్డెగాని సైదులు, పెంటమల్ల సుకన్య, పుట్ట రేనయ్య, సైదులు, వెంకన్న, వీరయ్య పాల్గొన్నారు.



దేవరకొండలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

● మిర్యాలగూడలో వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేవిడి శేఖర్‌రెడ్డి, గంధం రామకృష్ణ, నాయకులు కాశయ్య, అబ్దుల్లా, గోవర్ధనాచారి, శ్రీను, విష్ణు, సైదులు తదితరులు పాల్గొన్నారు. విజేత కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దనుంజయ, మధు, టీవీవీ నాయకులు హరికృష్ణ దుర్గయ్య, ప్రభాకర్, యాదయ్య, జ్యోతి, సైదమ్మ పాల్గొన్నారు. ఐన్‌టీయూసి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐన్‌టీయూసీ జిల్లా ప్రెసిడెంట్ అంబటి సోమయ్య, నాగభూషణం, సీపీఎం నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, చౌగాని సీతారాములు, మల్లు గౌతంరెడ్డి, పాండు, తిరుపతి పాల్గొన్నారు.

● చింతపల్లి మండలంలోని మదనాపురం గేట్ సమీపంలోని ఐలమ్మ విగ్రహానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూల యాదయ్య, బాదేపల్లి నిరంజన్‌గౌడ్, సీమర్ల శ్రీను, గడ్డం శేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ప్రజల్లో విశేష స్పందన



ఇందిరమ్మ మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలకు ప్రజల్లో విశేష స్పందన వస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పీఏపల్లి మండలకేంద్రంలో ఎమ్మెల్యే అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్సీ, బీసీ కాలనీలను సందర్శించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీకి రెండు కళ్లలాంటివని అన్నారు. గ్రామస్థాయిలో గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు అధికారులతో కలిసి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. మండలానికి సంబంధించిన కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించడం, ప్రజాక్షేత్రంలోకి అధికారులు తీసుకువెళ్లడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ జయశ్రీ, మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క నిఘా నేత్రం వందమంది పోలీసులతో సమానం

ఒక్క నిఘా నేత్రం (సీసీ కెమెరా) వంద మంది పోలీసులతో సమానమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. పీఏపల్లి మండలకేంద్రంలో నల్లగొండ సూర్య ఆసుపత్రి ఎండీ డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి సహకారంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల మానిటరింగ్ గదిని అదనపు ఎస్పీ మౌనికతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయాలు, వీధుల్లో కాకుండా ప్రతి ఇంట్లోనూ వ్యక్తిగతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న ప్రిసైడింగ్ ఆఫీసర్ నవీన్

వేములపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని ఉపాధి హామీ ప్రిసైడింగ్ ఆఫీసర్ నవీన్ అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి 12 గ్రామపంచాయతీల పరిధిలో ఉపాధిహామీ ద్వారా చేపట్టిన 196 పనులకుగాను రూ.3,08,7,657,45 పంచాయతీ రాజ్ పనులకుగాను రూ.2,48,56,844 ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ పనులకు గాను ఆయా గ్రామాల పరిధిలో తనిఖీలు నిర్వహించి బుధవారం సామాజిక తనిఖీ చేపట్టామన్నారు. ఈ పనుల్లో జరిగిన అవకతవకలపై రూ.15వేల జరిమానా విధించడంతో పాటు రూ.29వేల రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి జాబ్‌కార్డులు అందించడంతో పాటు అవసరమైన పని దినాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పనులు, హాజరు, మస్టర్ల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి చకిలం గోపాల్‌రావు, క్వాలిటీ కంట్రోల్ అధికారి ఫసియొద్దీన్, ఏపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఆర్పీ రంజిత్, ఎంపీవో లలిత, మిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరులో తెగిన డైవర్షన్ రోడ్డు

- బంకాపురం కల్వర్టుపై వరదనీరు
- వివిధ గ్రామాలకు నిలిచిన రాకపోకలు



ఊట్కూరులో వరదకు తెగిన డైవర్షన్ రోడ్డు

నిడమనూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద నీరు ముంచెత్తింది. ఊట్కూరులో పైనుంచి భారీగా వరద రావడంతో కల్వర్టు వద్ద ఉన్న డైవర్షన్ రోడ్డు తెగిపోయింది. ఊట్కూరులో కల్వర్టుకు ప్రత్యామ్నాయంగా బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్నందున మట్టితో డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. కానీ ఏడాది కాలంగా పనులు మందకొడిగా సాగుతుండటంతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడం లేదు. దీంతో రాత్రి కురిసిన భారీవర్షానికి మట్టి కోతకు గురై డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. వరదనీటిలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కొట్టుకుపోతుండగా గ్రామస్థులు తాళ్లు వేసి అతనిడిని బయటకు తీశారు. డైవర్షన్ రోడ్డు తెగిపోవడంతో ఊట్కూరు నుంచి నందికొండవారిగూడెం, గౌండ్లగూడెం, సోమారిగూడెం, ముప్పారం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లగొండ-నాగార్జునసాగర్ ప్రధాన రహదారి మీదుగా ప్రయాణం చేయాల్సి వచ్చింది. బ్రిడ్జి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతున్నందునే వర్షాలకు డైవర్షన్ రోడ్డు తెగిపోయిందని గ్రామస్థులు ఆరోపణలు చేస్తున్నారు. అదే విధంగా నిడమనూరు చిలుకల వాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బంకాపురం కల్వర్టు మీదుగా వరద నీరు ముంచెత్తింది. దీంతో మండలంలోని నిడమనూరు మీదుగా బంకాపురం, వెనిగండ్ల తదితర గ్రామాలకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. గత నెలలో కూడా కురిసిన వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. దీంతో బంకాపురం, వెనిగండ్ల గ్రామాలకు 14వ మైలురాయి చెక్‌పోస్టు మీదుగా ప్రయాణాలను మళ్లించారు. కల్వర్టు తెగిపోయి ప్రమాదాలు జరుగుతున్నా కల్వర్టు స్థానంలో బ్రిడ్జి నిర్మించకపోవడంతో పాటు పూర్తిస్థాయిలో మరమ్మతులు కూడా చేయకుండా గూనలు వేసి మట్టి పోసి చేతులు దులుపుకుంటున్నారు.

బుద్ధవనాన్ని సందర్శించిన పల్నాడు కలెక్టర్, ఎస్పీ



బుద్ధవనంలో పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీ

నాగార్జునసాగర్, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనాన్ని బుధవారం ఏపీలోని పల్నాడు కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాస్‌రావు సందర్శించారు. సాగర్ సందర్శనలో భాగంగా సాగర్ ప్రధాన డ్యాం, గ్యాలరీలను తిలకించారు. అనంతరం బుద్ధవనానికి చేరుకొని అక్కడ చరిత వనం, స్తూప వనం, జాతక వనం, ధ్యాన వనం, మహాస్తూపంలను తిలకించారు. మహాస్తూపం లోపల బుద్ధజ్యోతిని వెలిగించారు. వారికి బుద్ధవనం ఈవో శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర పంచశీల కండువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాచర్ల ఆర్డీవో మురళీకృష్ణ, అగ్రికల్చర్ జేడి జగ్గారావు, పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో మనోధైర్యం : బీఎల్ఆర్



విజేతలతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థుల్లో మనోధైర్యం పెరుగుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని అవంతీపురం గ్రామంలో బుధవారం తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడల పోటీల్లో ఆయన డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు తమ జట్టును గెలిపించడానికి చేసే ప్రయత్నంలో వారిలో మనోధైర్యాన్ని, పట్టుదలను తెలియచేస్తాయని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీ లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత ప్రతీ ఒక్కరి బాధ్యత

వేములపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతను బాధ్యతగా భావించాలని ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం టీఎఫ్ఎల్ కౌన్సిల్ సభ్యుడు మాతంగి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బ్యాంకుల ద్వారా అందిస్తున్న ద్వారా జనసురక్ష ఇన్సూరెన్స్ పథకాలను సద్వినియోగం చేసుకోవాన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్ పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి

మాడ్గులపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉపాధ్యాయులు నడుచుకోవాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మాడ్గులపల్లి కేజీబీవీ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సరోజపావని, ఇన్‌చార్జి ఎంపీడీవో సంగీత, ఎస్‌వో సునీత పాల్గొన్నారు.

ఓటర్లు 10.73 లక్షలు

(5వ పేజీ తరువాయి)

ప్రక్రియ మొదలవుతుంది. జీవో వచ్చిన వారం రోజుల్లో ఈ రెండు ప్రక్రియలు ముగుస్తాయి. అందుకోసం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీఆర్‌వోలు, ఆర్డీవోలు ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల కోసం సన్నద్ధంగా ఉన్నారు. రిజర్వేషన్లను ప్రకటించిన తక్షణమే ఎన్నికల ప్రచారంలోకి దిగేందుకు రాజకీయ నాయకులు ఇప్పటికే సన్నహాలు చేసుకుంటుండగా, ఎవరికి అవకాశం దక్కుతుందనే ఉత్కంఠ అందరిలో ఉంది.

జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు, ఓటర్లు ఇలా..

జడ్పీటీసీ స్థానం	ఎంపీటీసీ	పోలింగ్ స్టేషన్లు	మొత్తం ఓటర్ల సంఖ్య
అడవిదేవులపల్లి	5	26	14,674
అనుముల	8	45	23796
చందంపేట	9	64	30679
చండూరు	8	43	24323
చింతపల్లి	14	85	45054
చిట్యాల	12	60	35716
దామరచర్ల	14	78	40914
దేవరకొండ	11	65	35716
గట్టుప్పల్	5	27	15617
గుడిపల్లి	5	24	12271
గుండ్లపల్లి	13	78	41525
గుర్రంపోడు	12	74	38571
కనగల్	12	67	36892
కట్టంగూరు	13	63	37362
కేతేపల్లి	11	55	31084
కొండమల్లేపల్లి	9	53	29599
మాడుగులపల్లి	10	56	30523
మర్రిగూడ	10	51	30785
మిర్యాలగూడ	19	99	55180
మునుగోడు	13	69	38038
నకిరేకల్	9	47	26843
నల్లగొండ	13	67	39229
నాంపల్లి	11	68	36411
నార్కట్‌పల్లి	15	83	43772
నేరేడుగొమ్ము	6	45	20262
నిడమనూరు	13	65	36094
పీఏపల్లి	10	51	27644
పెద్దవూర	11	62	34494
శాలిగౌరారం	13	70	40388
తిప్పర్తి	9	48	27690
తిరుమలగిరిసాగర్	11	64	35075
త్రిపురారం	12	66	36698
వేములపల్లి	7	38	20568
మొత్తం	353	1956	1073506

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : కొత్తలోక, వెంకటేశ్వర: సుందరకాండ రాఘవ: కూలీ, విట్రోస్: కొత్తలోక, బ్రహ్మాండ, సుందరకాండ, దేవరకొండ : మనోజ్ : వార్ 2 మైత్రి వెంకటేశ్వర : కూలీ